

ధాన్యం కొనుగోళ్లలో మాఫియా



ధాన్యం కొనుగోళ్ల మాఫియా జరుగుతుంది. ప్రభుత్వం ధాన్యం బస్తాకు రూ.1636 మద్దతు ధర ప్రకటిస్తే బ్రోకర్లు రూ.1200కు కొనుగోలు చేస్తున్నారు.బస్తాకు వచ్చి రైతు రూ.436 చొప్పున నష్టపోతున్నాడు.బ్రోకర్లు,మిల్లర్లు మాఫియాగా మా దోచుకుతింటున్నారు. - **ఆకుల దుర్గయ్య, కడియం**

సాగునీరందక తీవ్ర నష్టాలు...



ఈ ఐదేళ్లలో సాగునీరందక తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాం. తాళ్లూరు పుష్కర లిఫ్ట్‌ను నమ్ముకుని వ్యవసాయం చేస్తాం. అడపాదడపా వర్షాలు వచ్చినప్పటికీ పంట చేతికొచ్చే సమయంలో సాగునీరందక ఎండిపోతున్నాయి. వైసీపీలో ఎదుర్కొన్న నష్టాలను ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. - **గొల్లపల్లి బుల్లబ్బాయి, రైతు, మల్లేపల్లి**

అరటికి ప్రభుత్వ సహకారం లేదు



ఎన్నో ఏళ్లగా అరటి సాగు చేస్తున్నా. గతంలో ధర బాగుండి ఎంతో కొంత లాభాలు వస్తుండేవి. గత నాలుగేళ్లగా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. ప్రతి ఏటా ఎకరానికి రూ.30 వేల నుంచి 40 వేల వరకు నష్టం వస్తోంది. ప్రభుత్వ సహకారం లభించడం లేదు. - **మద్దిపాటి జానకి, అరటి రైతు, తీపర్రు, పెరవలి మండలం**

ఐదేళ్లూ.. నోట్లోకి.. వెళ్లలేదు!

అన్నదాతకు అష్టకష్టాలే..



చివరికింతే : ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెంలో ఏటా ఇంతే

గోదావరి జిల్లాలంటేనే వ్యవసాయం గుర్తొస్తుంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలు కళ్ల ముందు మెదలుతారు. నిజానికి వ్యవసాయమంటేనే ఏటికి ఎదురీతలాంటిది. పెరిగిపోయిన పెట్టుబడులు, కూలీల కొరత ఓ వైపు, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు, సాగునీటి సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకో వైపు రైతులతో ఆటలాడుతుంటాయి. సాధారణంగా అనేక సమస్యలు చుట్టుముట్టినప్పుడు రైతు ఒడ్డున పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంటుంది. ధాన్యం కొనుగోలు ద్వారా, సాగునీటి సరఫరా ద్వారా ఆదుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు కోల్పోతే పంటల బీమాతో సాయం అందించేందుకు అభయమిస్తుంది. కానీ.. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను నిలువునా ముంచింది. ప్రతి గింజా కొంటున్నామని చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లని నిజమైన రైతులందరికీ ఆదిలోనే తెలిసిపోయింది. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనేసి మద్దతు ధర ఇచ్చేస్తున్నామని చెప్పడమూ అంతే మోసమని తేలిపోయింది. అమ్మిన ధాన్యానికి సొమ్ముల కోసం రైతన్నలు పడిన పాట్లను జన్మలో మర్చిపోలేరు. ఈ మొత్తం వ్యవహారం వెనుక దళారీలు, కొందరు మిల్లర్లు, ప్రభుత్వంలో కీలకమైన ప్రముఖులు ఆడిన నాటకంలో చివరకు దగా పడింది రైతన్నే. గోదావరి జిల్లాల్లో ఏటా సాగు నీటి సమస్యలు తప్పవు. అందుకు ఏ ప్రభుత్వమైనా అటు గోదావరి, ఇటు కాల్వల వ్యవస్థలను ఆధునికీకరణ చేస్తుండడం సర్వసాధారణం. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసింది సున్నా. సాగునీటికి ఈ క్షణం కూడా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల రైతుల పరిస్థితీ ఇంతే. రైతులకు ఈ ఐదేళ్లూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు.. ఐదు వేళ్లూ నోట్లోకి వెళ్లడమే కష్టం మారింది.. అందుకే ఎన్నికల సమయమిది...ఆలోచించాల్సిన తరుణమిది...!!



అన్నదాత ఎదురీత 6

- వైసీపీ సాగు..బాగా లేదు
- అన్నదాతలతో చెలగాటం
- ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకోలేదు
- పలకరింపునకూ నోచుకోలేదు
- ధాన్యం కొనుగోళ్లలో మాఫియా
- ఆధునికీకరణ ఊసేలేదు

సామర్లకోట, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వం అన్నదాతల జీవితాలతో ఆటలాడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం చేసే రైతులు గడిచిన ఐదేళ్లలో సాగుకు అష్టకష్టాలు పడ్డారు. ఒకపక్క తుఫాన్లు, అకాల వర్షాలు, వర్షాభావం రైతుల వెన్ను విరిచాయి. పెట్టిన పెట్టుబడులు దక్కక, ప్రభుత్వం ఆదుకోక అన్నదాతలు రోడ్డునపడ్డారు. పంటలు తుడిచిపెట్టుకుపోయి అప్పులపాలయ్యారు. మిచౌంగ్ తుఫాన్‌లో ధాన్యం తడిచి మొలకలు వస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోలేదు. పీకల్లోతు కష్టాల్లో మునిగిన అన్న దాతలను వైసీపీ నాయకులు పలకరించిన దాఖలా లేవ్. వ్యవసాయాధికారులు అరకొర నివేదికలు పంపినా నష్టపోయిన రైతులకు సొమ్ములు పడలేదు. ఏదోలా మిగిలిన వరి పంటను విక్రయించడానికి ప్రయత్నిస్తే అన్యాయమే జరిగింది. వైసీపీ పాలనలో ఐదేళ్లూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎక్కడికక్కడ చేతులెత్తేసింది.ఆర్బీకేలకు అన్నదా తలు తెచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కొనకుండా నరకం చూపించింది. ధాన్యం డబ్బులకు ముప్పు తిప్పలు పెట్టింది. తేమ పేరిట ధాన్యాన్ని దళారులకు అమ్ముకునేలా చేసింది.ఇక రబీలో బొండాల రకం ధాన్యం నిషేధం పేరిట నష్టపరిచింది. రైతులకు యంత్ర పరికరాలు మంజూరులో విఫలమైంది. ఈ ఐదేళ్లలో అప్పుల భారం మరింత పెరిగి రైతులకు ఐదువేళ్లూ నోట్లోకి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. పంట కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరించక సాగునీటి ఇబ్బందులే. ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులకు, గోదావరి పరీవాహక ప్రాంత రైతులకు మధ్య నీటి యుద్ధాలు తప్పలేదు. చెరకు పంట వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని చక్కెర పరిశ్రమలు మూతబడ్డాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సగ్గుబియ్యం తయారీ పరిశ్రమలు సామర్లకోట, పెద్దాపురంలలోనే సుమారు 32 ఉండేవి. దుంప సాగు రైతులకు ప్రభుత్వం నుంచి ఏ సహకారం లేకపోవడంతో ఈ ఐదేళ్లలో సుమారు 18 సగ్గు బియ్యం మిల్లులు మూ తబడ్డాయి. దుంపసాగు కూడా చెరకు సాగు రీతిలోనే కనుమరుగవుతోంది.

అరటి రైతుకు లేదు బీమా ధీమా..

పెరవలి: అరటి గెలలకు రేటు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత నాలుగేళ్లగా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు పది వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తుంటారు. ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి పెడతారు. వెదురు కొనుగోలుకు మరో రూ.50 వేల వరకు ఖర్చు. అంటే సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తారు. గెల ఒక్కింటికీ రూ.200 నుంచి 250 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే రైతుకు లాభసాటిగా ఉంటుంది. గత నాలుగేళ్లలో గెల ఒక్కటి రూ.100 నుంచి రూ.150 వరకు మాత్రమే ధర పలికింది. కొన్ని సమయాల్లో 100 కంటే తక్కువకే కొనుగోలు చేశారు. దీంతో అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోలేదు. చివరకు బీమా సొమ్ములు తమకు దక్కట్లేదని అరటి రైతులు ఆవేదన చెందుతున్నారు.

నర్సరీ రైతులకు చేసిందేమీ లేదు..



కడియం, ఏప్రిల్ 21: దేశవ్యాప్తంగా పేరొందిన కడియం నర్సరీ రైతులకు వైసీపీ ప్రభుత్వంలో చేసిందేమీ లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో కడియంను ప్రత్యేక హబ్‌గా గుర్తించి నర్సరీ రైతులకు సోలార్ పథకాన్ని అందించేవారు. ఈ మండు వేసవిలో నిరంతర విద్యుత్ అందక నానా అవస్థలు పడుతున్నారు. పాలీహౌస్‌లు, షేడ్ నెట్లు, సబ్సిడీపై సూక్ష్మబిందు సేద్యం, బ్యాటరీ స్ప్రేయర్లు వంటి పథకాలు రాయితీపై అందిన దాఖలాలు లేవు. అయినా ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కడియపులంకలో ఏర్పాటుచేసిన ఎకో టూరిజం కేంద్రం పునాదుల్లోనే ఆగిపోయింది. నర్సరీ రైతులను శాస్త్ర, సాంకేతికంగా అభివృద్ధిపరచాలనే ఉద్దేశంతో వేమగిరి శివారులో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఈ ఐదేళ్లలో నర్సరీ రైతులకు కష్టాలే మిగిలాయి..

జగనన్నా.. ఇలా చేశావేంటన్నా..

బీమా చెల్లించక రైతులు నష్టపోయారు...



ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించకపోవడంతో వర్షాల సమయంలో రైతులు నష్టపోయారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సొసైటీల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీతో రుణాలు ఇచ్చేవారు. ఇప్పుడు ముందుగానే 7 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ అందలేదు. టీడీపీ ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేది.. జగన్ రూ.25 వేలు అందిస్తామని చెప్పి ఇప్పుడు రూ.15 వేలిస్తున్నారు. ఇటీవల జగన్ బటన్ నొక్కినా రైతులకు ఒక్క రూపాయి జమ కాలేదు.

- **మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, అమలాపురం రూరల్**

కాల్వలు ఆధునికీకరించక ఇబ్బందే..



పది ఎకరాల వరి పొలం సాగు చేస్తున్నా. మాగాం-అయినాపురం పంటకాల్వ ఆధునికీకరణ సక్రమంగా లేక రబీలో నీటిఎద్దడి ఎదుర్కొన్నాం. ఖరీఫ్‌లో అధిక వర్షాలతో ముంపు వల్ల నష్టపోతున్నాం. నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కౌలు రైతులకు రుణాలందిస్తామని ప్రకటనలు చేస్తున్నా వాస్తవంలో అమలు కావట్లేదు.

- **కొప్పుల వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం**

ఐదేళ్లుగా..డ్రెయినేజీలకు మోక్షంలేదు..



డ్రెయిన్లలో పూడిక తీసి పంట పొలాలను ముంపు నుంచి కాపాడాలని ఐదేళ్లుగా మొరపెట్టుకుంటున్నాం. అధికారులు ప్రతి ఏటా డ్రెయిన్లను పరిశీలించి పూడికతీతకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెబుతున్నారు. అయినా పని జరగడంలేదు. గత రెండేళ్లుగా సార్వాను వదిలేసుకున్నాం. దాళ్వాలోనూ మురుగునీరు దిగే మార్గం కనిపించక పంట నష్టపోతున్నాం. రైతు సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం డ్రెయిన్లను సకాలంలో ఆధునికీకరించడం లేదు.

- **దోనిపాటి నాగేశ్వరరావు, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం**

ధాన్యం డబ్బులు టైమ్‌కి అందడంలేదు..



నేను 13 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. ఎంటీయూ 1121 రకాన్ని పండించా. ధాన్యం పొలం నుంచి ఒడ్డుకి తెచ్చి..ఆరబెట్టిన తరువాత మిల్లుకు తోలుతున్నాం. లోడింగ్, కాటా, జట్టు ఇలా బస్తాకు రూ. 100 వరకు ఖర్చవుతుంది. ధాన్యం సొమ్ములు ఆలస్యంగా వస్తున్నాయి. దీంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. - **ఈదల సత్యనారాయణ, రాజమండ్రి రూరల్1**


తుఫాన్ నష్టమూ ఇవ్వలేదు...



మిచౌంగ్ తుఫాన్ కారణంగా నేను పదెకరాల్లో సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతింది. కోయడానికి కూడా పనికిరాకుండా పోయింది. నష్టపరిహారం అందిస్తామని అప్పట్లో అధికారులు, నాయకులు చెప్పారు. నెల రోజులు అన్నారు... నేటికీ అతీగతీ లేదు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- **గన్ని శ్రీనివాస్, రైతు, పెనికేరు, ఆలమూరు మండలం**

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి 7



నేడు చంద్రబాబు రాక

జగ్గంపేట బహిరంగ సభకు సర్వం సిద్ధం

జగ్గంపేట, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటకు రానున్నారు. సాయంత్రం భారీ బహిరంగసభకు ఆయన హాజరుకానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.05 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి జగ్గంపేటలోని కోదూరి రంగారావు గ్రౌండ్‌లో హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి సామర్లకోట-గోకవరం రోడ్డు జంక్షన్‌కు చేరుకోనున్నారు. 3.30 గంటల నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 5.10 గంటలకు అక్కడి నుంచి హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో విజయనగరం బయలుదేరనున్నారు. జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జగ్గంపేట-గోకవరం రోడ్డులో హెలిపాడ్ పనులను తూర్పు ప్రోగ్రాం పరిశీలకుడు హనుమంతరావు పర్యవేక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. బహిరంగ సభ విజయవంతానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చర్యలు తీసుకుంటున్నారు.



రేపు పవన్‌కల్యాణ్ నామినేషన్

గొల్లప్రోలు నుంచి పిఠాపురం వరకు ర్యాలీ .. సాయంత్రం ఉప్పాడలో సభ

పిఠాపురం, ఏప్రిల్ 21: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 23న పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఉదయం పది గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసం నుంచి పవన్ బయలుదేరి గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల మీదుగా ప్రదర్శనగా పాదగయక్షేత్రం వద్దకు చేరుకుంటార న్నారు. అక్కడి నుంచి కాలినడకన పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఆర్వోకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. పవన్ నామినేషన్ ర్యాలీకి తరలివచ్చి, బహిరంగసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



జయం మనదే : చంద్రబాబు అందజేసిన బి.ఫారాలతో టీడీపీ అభ్యర్థులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి

విజయీభవ

అభ్యర్థులకు బి.ఫారాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : విజయీభవ! అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని కూటమి అభ్యర్థులను ఆశీర్వదించారు. టీడీపీ అభ్యర్థులకు ఆదివారం బి.ఫారాలు అందజేసి విజేతలుగా రావాలని సూచించారు. రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ అభ్యర్థి ఆదిరెడ్డివాసు, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం అమరావతి వెళ్లి చంద్రబాబు చేతుల మీదుగా బి.ఫారాలు అందుకున్నారు. కూటమి తరపున జనసేన నేతలు నిడదవోలు నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణలకు రెండు రోజుల కిందటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ బి.ఫారాలు అందజేశారు. రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తప్ప మిగతా కూటమి సభ్యులంతా ఇప్పటికే నామినేషన్లు దాఖలుచేశారు.లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.సోమవారం బత్తుల బలరామకృష్ణ; మంగళవారం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్లు దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉన్న సంగతి తెలిసిందే. అందులో కూటమి తరపున టీడీపీ నాలుగుచోట్ల, జనసేన రెండు చోట్ల, బీజేపీ ఒక చోట పోటీ చేస్తోంది. లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల వ్యయంపై దృష్టి పెట్టండి

రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయపరిశీలకురాలు నీనా నిగమ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఆదివారం వ్యయపరిశీలకులు,సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో ఖర్చుల వివరాలు, ఆడిటింగ్‌పై సమీక్షించారు. నామినేషన్ల పర్వం ఆరంభమైన నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. ఓటరు తన ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.ఎవరూ ప్రలోభపెట్టకూడదని తెలిపారు. అభ్యర్థుల ఖర్చులన్నీ చూపడానికి నిష్పక్షపాతంగా సిబ్బంది వ్యవహరించాలన్నారు.బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తం నగదు డిపాజిట్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మద్యం అమ్మకాలు, స్టాక్ రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్ బృందాల ద్వారా వాహనాలు తనిఖీలు చేయాలన్నారు. రాష్ట్ర జిల్లా ఎక్సయిజ్ శాఖలు ఇంటెన్సివ్ తనిఖీ ద్వారా మద్యం చలామణిని నిరోధించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నగదు ప్రవాహాన్ని ఓటర్లు, అధికారులు కూడా పర్యవేక్షించాలన్నారు. వస్తువుల తనిఖీ సమయంలో జీఎస్టీ పన్ను కోసమే కాకుండా ఆ వస్తువులు ఓటర్లకు పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయేమో కూడా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్, ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్. డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.


అందరికీ ఆయనే వినాయకుడు



పి.గన్నవరం, ఏప్రిల్ 21: ఏ పార్టీకి చెందిన అభ్యర్థులైన ఆయన ఆశీస్సులు పొందాల్సిందే. విజయాన్ని ప్రసాదించు తండ్రీ..అని ఆయనను వేడుకోవాల్సిందే. అయినవిల్లి వినాయకుడి ప్రత్యేకత ఇది. పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి పార్టీలు ఎవరికి సీటు కేటాయించినా అభ్యర్థి ఎవరైనా సరే ముందుగా అయినవిల్లి వెళ్లి వినాయకుడిని దర్శించుకుంటారు. ఆ తర్వాతే ప్రచారం మొదలుపెడతారు. ఇది సెంటిమెంటుగా వస్తుంది. అలాగే గెలిచిన వెంటనే కూడా ఆయననే దర్శించుకుంటారు.

అన్నదాత ఎదురీత

వైసీపీ పాలనలో కుదేలైన రైతులు



ఏలేరు సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలం

అటు సాగునీటి సమస్య
ఇటు ముంపు

- ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణ జరగక ఇక్కట్లు
- భారీ వర్షాలు కురిస్తే కాలనీలకు కాలనీలు నీట మునక
- వందలాది ఎకరాల్లో పంట నష్టం
- టీడీపీ హయాంలో ఆధునికీకరణ పనులు మొదలు
- జగన్ సీఎం అయ్యాక అవన్నీ నిలిచిపోయిన వైనం
- వైసీపీ పాలనలో రైతులను వెన్నాడిన కష్టాలు



ఏలేరు, సుద్దగడ్డ వరద కారణంగా ముంపునకు గురైన పంట పొలాలు

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 21: ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణపై వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. జరుగుతున్న ఆధునికీకరణ పనులు నిలిపివేసి అయిదేళ్ల పాలనలో ఒక్క పనీ జరగకుండా చేసిన జగన్ ప్రభుత్వ తీరుపై రైతులు మండిపడుతున్నారు. ఏలేరు, పీబీసీ, సుద్దగడ్డ ఆయకట్టు పరిధిలో వర్షాలు కురవకపోతే సాగునీటి సమస్య, వర్షం కురిస్తే ముంపు బెడద. టీడీపీ హయాంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా రివర్స్ అయింది. జరుగుతున్న పనులను నిలిపివేశారు. ఏలేరు, సుద్దగడ్డ కారణంగా గొల్లప్రోలు పట్టణంలోని కాలనీలతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 25వేల ఎకరాల్లో పంట ముంపునకు గురవుతోంది. ఏ మాత్రం అధికవర్షాలు కురిసినా సుద్దగడ్డకు వరద వచ్చి గొల్లప్రోలు కాలనీలన్ని ముంపునకు గురవుతున్నాయి. ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలయ్యే వరద జలాలు సముద్రానికి చేరే వ్యవస్థ లేకపోవడం సమస్యగా మారింది. దీనికి పరిష్కారం చూపేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.135 కోట్లుతో ఏలేరు ఆధునికీకరణ పనులు చేపట్టి 55 శాతం పూర్తి చేశారు. 2019 జనవరి నెలలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ (ఫేజ్-2) కోసం మరో రూ.147 కోట్లు మంజూరుచేసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు రెండేళ్ల వ్యవధిలో పూర్తిచేస్తామని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో తమ కష్టాలు తీరినట్టేనని రైతులు భావించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో జరుగుతున్న పనులను నిలిపివేయడంతోపాటు రెండవ విడతకు పిలిచిన టెండర్లను రద్దు చేశారు. పాదయాత్ర సమయంలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ చేపడతామని చెప్పిన జగన్ అసలు దానిని పట్టించుకోలేదు. సీఎం హోదాలో గొల్లప్రోలు వచ్చి ఆధునికీకరణకు నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటించిన ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. అయిదేళ్ల కాలంలో రైతులు సాగునీటి సమస్య కారణంగా తీవ్రంగా నష్టపోయారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో కాకినాడ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1.07 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. నాలుగేళ్లు దాళ్వా సమయంలోనూ, రెండుసార్లు సార్వా సమయంలో తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడి వరి పంట ఎండిపోయింది. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సుమారు 10 వేల ఎకరాల్లో వరిపంట సాగునీరు అందక ఎండిపోవడంతో పాటు పొలాలు బీటలు వారాయి. పీబీసీ ఆధునీకరణ పనులను విస్మరించడం ఆ ఆయకట్టు రైతులకు శాపంగా పరిణమించింది.

> అన్నదాతల కష్టాలు అన్నీఇన్నీ కావు. 'నేను విన్నాను..నేను ఉన్నాను'.. అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌పై రైతులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. తమ కష్టాలు తీరుస్తారని అనుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనాడూ రైతులను పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టుల పునర్నిర్మాణం కానీ కాల్వల ఆధునీకరణ పనులు కానీ ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.



మండపేట: తాపేశ్వరంలో శిథిలావస్థకు చేరిన లాకులు




ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ భవనం

4 ఏళ్లుగా నత్తనడకన
ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పూర్తయ్యేనా?

సామర్లకోట, ఏప్రిల్ 21: కాకినాడ జిల్లా సామర్లకోట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదల లేక.. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాక ఏడాది కాలంగా అసంపూర్తిగా భవన నిర్మాణం నిలిచిపోయి ఉంది. వ్యవసాయ మంత్రిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నాలుగేళ్ల కిందట మొదలెట్టిన ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు విషయంలో అప్పటి వ్యవసాయ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఆయన స్థానంలో కమిషనర్‌గా వచ్చిన గోపాలకృష్ణ ద్వివేది ఈ ల్యాబ్ నిర్మాణం నిరుపయోగమైందని, దీనికి నిధులు అదనంగా మంజూరు చేయడం దండగని తేల్చేశారు. ఇప్పటివరకూ నిర్మించిన భవనాన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు అప్పగించేయండి అని ఉచిత సలహా ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న ల్యాబ్‌లు నిరుపయోగంగా ఉన్న అంశాన్ని జిల్లా అధికారులు ఎందుకు గుర్తించలేదంటూ అధికారులపై సైతం ద్వివేది ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దాంతో ఈ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయి నిరుపయోగంగా మారింది. కనీసం నిర్మాణం పూర్తిచేసి ఆధునిక వ్యవసాయ పరిశోధన కేంద్రంగా ఏర్పాటుచేసే రైతులకు మంచి జరిగేదని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.


సాగునీటి పథకాలకు మంగళం




జెడ్.మేడపాడులో శిథిలావస్థలో లాకులు

మండపేట/ఆత్రేయపురం, ఏప్రిల్ 21: టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఇరిగేషన్‌కు పెద్దపీట వేస్తే ఇప్పటి వైసీపీ ప్రభుత్వం మాత్రం సాగునీటి పథకాలకు మంగళం పాడింది. టీడీపీ ప్రభుత్వంలో 1997లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు సాగునీటి సంఘాలు ఏర్పాటుచేశారు. ఆయన ప్రారంభించిన సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పంట కాల్వలు, మురుగు కాల్వలు ఆధునీకరణ పనులు చేసేవారు. అనంతరం చంద్రబాబునాయుడు నీరు-చెట్టు పేరిట పథకాన్ని ప్రారంభించి పంటకాల్వల డ్రెయిన్లకు ఇబ్బడిముబ్బడిగా నిధులు అందజేసి ఆధునీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు డ్రెయిన్ల ఆధునీకరణకు పెద్దపీట వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2007-08లో డెల్టా మోడర్నైజేషన్ పేరిట భారీగా ఇరిగేషన్ పనులు చేపట్టారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇరిగేషన్ పనులకు సంబంధించి సాగునీటి సంఘాలు, ఇరిగేషన్ శాఖతో పాటు పంటకాల్వలు, డ్రైనేజీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు 2019 నుంచి ఇప్పటివరకు సాగునీటి సంఘాల ఊసేలేదు. పంటకాల్వల ఆధునికీకరణ లేదు. మధ్యలో నిలిచిపోయిన ఇరిగేషన్ కల్వర్టులు, క్వార్టర్స్ పూర్తిచేసిన దాఖలాలు లేవు. కేవలం కోనసీమ జిల్లాలోనే ఉన్న పంటకాల్వల్లో గుర్రపు డెక్క తొలగింపు కోసం ఏటా రూ.కోటి వరకు వ్యయం అవుతుంది. కానీ వీటికి కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయని దుస్థితి. సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు రైతుల అవసరాల మేరకు సంఘాలు ఇరిగేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పంటకాల్వలకు మరమ్మతులు పనులు జరిగేవి. కానీ నేడు ఆధునికీకరణ లేదు. ఇరిగేషన్ గురించి ఐదేళ్లలో ప్రస్తావనేలేదు. మురుగుకాల్వల ఆధునికీకరణ లేకపోవడం వల్ల తుపాన్లు, వర్షాల సమయంలో భారీగా పంటనష్టం వాటిల్లుతోంది. అటు బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని పట్టించుకున్న దాఖలాలే లేవు. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 16 మండలాలకు సాగు నీరు అందించే లొల్ల లాకుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గత ఐదేళ్ల నుంచి కనీస నిర్వహణకు నోచుకోకపోవడంతో శిథిల స్థితికి చేరుకుంది. గతేడాది ఆధునికీకరణకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. ఇరిగేషన్ వ్యవస్థను పటిష్టం చేయకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు.


నయినాల గణేశ్వరరావు


నీతిపూడి గణపతిరావు


ఉండ్రు కృష్ణారావు


పులపర్తి నారాయణమూర్తి


అయ్యాజీ వేమా


పాముల రాజేశ్వరి


కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం నియోజకవర్గ చరిత్ర

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి
1962	నయినాల గణేశ్వరరావు(కాంగ్రెస్)	బోడపాటి నరసింహారావు(సీపీఐ)
1967	గెడ్డం మహాలక్ష్మి(కాంగ్రెస్)	నీతిపూడి గణపతిరావు(సీపీఐ)
1972	గెడ్డం మహాలక్ష్మి(కాంగ్రెస్)	నీతిపూడి గణపతిరావు(స్వతంత్ర)
1978	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్(ఐ)	ఎస్.వేములు(జనతా)
1983	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)
1985	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	గంధం రామారావు(కాంగ్రెస్)
1989	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)
1994	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)
1996	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)	బత్తుల వెంకటరావు(కాంగ్రెస్)
1999	మానేపల్లి అయ్యాజీ వేమా(బీజేపీ)	కుసుమ కృష్ణమూర్తి(కాంగ్రెస్)
2004	పాముల రాజేశ్వరీదేవి(కాంగ్రెస్)	మానేపల్లి అయ్యాజీ వేమా(బీజేపీ)
2009	పాముల రాజేశ్వరీదేవి(కాంగ్రెస్)	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)
2014	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)	కొండేటి చిట్టిబాబు(వైసీపీ)
2019	కొండేటి చిట్టిబాబు(వైసీపీ)	నేలపూడి స్టాలిన్‌బాబు(టీడీపీ)

> అంబాజీపేట కొబ్బరి తియ్యదనం..డొక్కా సీతమ్మ దాన గుణం.. అయినవిల్లి వినాయకుడి ఆశీస్సులు..అప్పనపల్లి బాలబాలాజీ కరుణాకటాక్షాలు.. చారిత్రాత్మక ఆదుర్రు బౌద్ధ స్థూపాలు.. చుట్టూ గోదావరి..ఇలా వ్యవసాయానికి, ఆధ్యాత్మికతకు నెలవు పి.గన్నవరం నియోజకవర్గం.





లంక గ్రామాల్లో వరద కష్టాలు (ఫైల్ ఫొటోలు)



డొక్కా సీతమ్మ గారి ఇల్లు



ఆదుర్రులో బౌద్ధ ఆనవాళ్లు..

విభిన్న నియోజకవర్గం



పి.గన్నవరం అక్విడెక్టు

• (పి.గన్నవరం)

పి.గన్నవరం నియోజకవర్గం ఉమ్మడి జిల్లాల్లోనే విభిన్నమైన నియోజకవర్గం. ఈ నియోజకర్గంలో మూడు పక్కలా గోదారే. మూడు మండలాల్లో నదీపరివాహక ప్రాంతం ఎక్కువగా ఉంది. లంక గ్రామాలు ఎక్కువగా ఉండడంతో అధిక శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. కొబ్బరికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధనా కేంద్రం కూడా అంబాజీపేట మండలంలో ఉండడం విశేషం. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలతో పాటు మామిడికుదురు మండలంలోని 11 గ్రామాలను కలుపుకుని గన్నవరం నియోజకవర్గం ఏర్పడింది. సకల విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయకుడు అయినవిల్లి మండలంలో కొలువై ఉన్నాడు. మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి శ్రీబాలబాలాజీ ఆలయం బాల తిరుపతిగా వినతికెక్కింది. అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ నివాసం పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలో ఉంది. మామిడికుదురు మండలం ఆదుర్రులో బౌద్ధుల కాలంలో నిర్మించిన స్థూపం, పి.గన్నవరం అక్విడెక్టు పర్యాటకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొబ్బరి ఉత్పత్తిలో ఏపీ నాలుగో స్థానంలో ఉంది. కొబ్బరి ఉత్పత్తికి సంబంధించి తెగుళ్ల నివారణ, అభివృద్ధి నిమిత్తం ఉభయ రాష్ట్రాలకుగాను ఉద్యానవన పరిశోధనా కేంద్రం ఈ నియోజకవర్గంలోని అంబాజీపేటలో ఉంది.

వరదలొస్తే లంకలు విలవిల

రోజుల తరబడి యాతన

పి.గన్నవరం నియోజకవర్గంలో వరదల సమయంలో లంక గ్రామాలు కన్నీరు పెడతాయి. ఆదుకునే వారి కోసం దీనంగా ఎదురుచూస్తాయి. ప్రతి ఏడాది గోదావరికి వరదల సమయంలో లంక గ్రామాలు రాత్రికి రాత్రే మునిగిపోతాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతారు. ఇంట్లో సామగ్రిని కోల్పోయే వారు కొందరు, పాడి పశువులను కోల్పోయే వారు కొందరు. అలాగే ఎన్నో ఇళ్లు నేలమట్టమవుతాయి. నాయకులు వచ్చి పలకరించి పోతారు తప్పా పరిహారం మాత్రం రాదు. వరదల సమయంలో లంక గ్రామాలకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోతాయి. ఈ సమస్య పరిష్కారానికి తొగరపాయ దగ్గర ఎదురుబిడం కాజ్‌వే, పి.గన్నవరం కె.ఏనుగుపల్లి దగ్గర కాజ్‌వే నిర్మించాల్సి ఉంది. కానీ నాయకులు హామీలు ఇవ్వడం తప్ప వాటిని పూర్తి చేసే వారు లేరు. అలాగే మామిడికుదురు మండలం అప్పనపల్లి వద్ద కాజ్‌వే నిర్మిస్తే వరదల సమయంలో వినాయక ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. అలాగే ప్రతి లంక గ్రామంలోనూ తుఫాన్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఒక్క గ్రామంలో కూడా షెల్టర్ ఏర్పాటు చేయలేదు. వరదల సమయంలో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

గోదారమ్మ ఒడిలో..

ఎన్నో విశేషాల మణిహారం.. పి.గన్నవరం

నగరం, గన్నవరం నియోజకవర్గాలకు సంబంధించి మొత్తంగా చూసుకుంటే ఏడుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, టీడీపీ-బీజేపీ కూటమిలో భాగంగా ఒక్కసారి బీజేపీ గెలుపొందాయి. 1996లో టీడీపీ ఎమ్మెల్యే ఉండ్రు కృష్ణారావు మృతి చెందారు. మధ్యంతర ఎన్నికల్లో పులపర్తి నారాయణమూర్తి (టీడీపీ) గెలుపొందారు. 2004లో టీడీపీ-బీజేపీ కూటమిలో భాగంగా టీడీపీ నుంచి పులపర్తికి సీటు దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో త్రిముఖ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి పాముల రాజేశ్వరీదేవి అనూహ్యంగా గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ పోటీలో ఉండడంతో త్రిముఖ పోరు నెలకొని రాజేశ్వరీదేవిని ఎమ్మెల్యే పీఠం వరించింది. 2019లో త్రిముఖ పోరులో వైసీపీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు సునాయాసంగా గెలిచారు.

1962లో పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేటలోని నాలుగు గ్రామాలను కలుపుకుని నగరం నియోజకవర్గం ఏర్పడింది. 1962లో జనరల్, అపై ఎస్సీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి 2004 వరకు 11సార్లు ఎన్నికలు జరిగాయి. మొట్టమొదటిగా జనరల్ స్థానం నుంచి నయినాల గణేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలంలోని 11 గ్రామాలతో గన్నవరం నియోజకవర్గం ఆవిర్భవించింది. 2009 నుండి 2019 వరకు మూడుసార్లు ఎన్నికలు జరిగాయి.

ఓటర్లు

పి.గన్నవరం నియోజకవర్గంలో 1,96,337 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 98,969, స్త్రీలు 97,363 మంది, ఇతరులు ఐదుగురు. మండలాల వారీగా... మామిడికుదురు 37,532 మంది, అంబాజీపేట 49,424 మంది, పి.గన్నవరం 58,215 మంది, అయినవిల్లి 51,116 మంది ఓటర్లు ఉన్నారు.

అభివృద్ధి లేదు..



పరిశోధన కేంద్రం

ఎన్నికలొస్తే చాలు.. 'దిగుమతి' నాయకుల చూపు పి.గన్నవరం నియోజకవవర్గం వైపే ఉంటుంది. ఇప్పటివరకు సరైన నాయకుడు రాకపోవడంతో అభివృద్ధి వాగ్దానాలు అలాగే మిగిలిపోయాయి. ప్రభుత్వాలు అందించే సంక్షేమం తప్ప గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం. నిరుపేదలకు ఇళ్లు అని చెప్పి గోదారమ్మ ఒడిలో స్థలాలు చూపించి చేతులు దులుపుకున్నారు. ఇంటి స్థలం లేకుండానే గొప్పలు చెప్పుకోవడానికి పట్టాలు పంపిణీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. గ్రోయిన్ల నిర్మాణం జరగలేదు. దీంతో సన్న, చిన్నకారు రైతుల విలువైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. గోదావరి వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మించాల్సిన కాజ్‌వేల ఊసేలేదు. నియోజకవర్గ ప్రధాన కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, కాలనీలను డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. పర్యాటక కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకునే నాథుడే లేడు.

జగ్గంపేట నియోజకవర్గం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. పొలాలకు సాగునీరు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంవల్ల నిరుపయోగంగా మారాయి. నియోజకవర్గంలో ఎటువైపు చూసినా గతుకుల రహదారులు తప్ప నిర్మాణాలు చేపట్టలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులతోపాటు వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, కాపు కల్యాణ మండపం, ఇండోర్ స్టేడియం వంటివి ఎన్నో జగ్గంపేటలో నెలకొల్పేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకున్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలన్నీ మూలనపడ్డాయి. కేవలం టీడీపీ హయాంలో మొదలెట్టారనే కక్షతోనే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా వైసీపీ పూర్తి చేయక పోవడం గమనార్హం.

టీడీపీ హయాంలో కళకళ..
వైసీపీ వచ్చాక విలవిల

- జగ్గంపేట నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి
- సాగునీటి ప్రాజెక్టులు గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- పనిచేయని తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్
- నిలిచిన రామవరం పురుషోత్తపట్టణం ఫేజ్-2
- అభివృద్ధికి నోచుకోని మల్లవరం ఎత్తిపోతల పథకం
- సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు
- నియోజకవర్గంలో ఒక్క రోడ్డూ అభివృద్ధి పరచని ప్రభుత్వం
- లబ్ధిదారులకు అందని టిడ్కో ఇళ్లు..
- పెండింగ్‌లోనే ఇండోర్ స్టేడియం నిర్మాణం


రామవరంలో నిలిపివేసిన పురుషోత్తపట్నం ఫేజ్-2 ప్రాజెక్టు

సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం చేసిన వైసీపీ

జగ్గంపేట, ఏప్రిల్ 21: టీడీపీ ప్రభుత్వం సమకూర్చిన నీటి వనరులను వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. గండేపల్లి మండలం తాళ్లూరులో 2003లో టీడీపీ హయాంలో చంద్రబాబు పుష్కర ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ హయాంలో అది పూర్తయింది. దశాబ్ధకాలంపాటు ఈ ప్రాజెక్టు ద్వారా 30వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అయ్యింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి పెట్టకపోవడంతో మోటార్లు మరమ్మతులకు గురవడం, పైపులైన్లు దెబ్బతినడంతో ఒక్క చుక్క నీరు కూడా అందడంలేదు. దీంతో తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనిచేయకుండాపోయింది. పుష్కర జలాలను ఏలేరుకు అనుసంధానం చేస్తూ జగ్గంపేట మండలం రామవరంలో రూ.600కోట్లతో ఏర్పాటు చేసిన పురుషోత్తపట్నం ఫేజ్-2 ప్రాజెక్టును వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలుపుదల చేసింది. దీంతో జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండల రైతులకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. రూ.130కోట్లతో మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని టీడీపీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంతో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఎక్కడ పైపులైన్లు అక్కడే ఉండిపోయాయి. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. పుష్కర జలాలు అందకపోవడంతో మెట్టప్రాంతమైన గుర్రప్పాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, నరేంద్రపట్నం, బావారం గ్రామాలకు నీరందక తొలకరి పంటలు మధ్యలోనే ఎండిపోయాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 2023లో సార్వా, 2024లో దాళ్వా పంటను కొనుగోలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ముందుకు రాలేదు. 2023లో అకాల వర్షాల కారణంగా పంటలు తడిసిపోతే జ్యోతుల నెహ్రూ గ్రామాల్లో పర్యటించి కలెక్టర్‌తో మాట్లాడితే కానీ పంట కొనుగోలు చేయలేదు ఈ వైసీపీ ప్రభుత్వం.


జగ్గంపేట మండలంలో సాగునీరందక ఎండిపోయి బీడువారిన భూమి

అభివృద్ధికి అడ్డుపడిన వైసీపీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో జగ్గంపేట పట్టణంలో 3600మందికి సొంతింటి కల నెరవేర్చేందుకు టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను గాలికొదిలేసింది. జగ్గంపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి పరచాలని టీడీపీ సన్నాహాలు చేసి గండేపల్లి మండలం జడ్.రాగంపేటవద్ద వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ నిర్మాణ పనులు కాస్తా నిలిచిపోయాయి. టీడీపీ హయాంలోనే నిర్మించిన కాపు కల్యాణ మండపం వైసీపీ ప్రారంభించినా సరే దాన్ని పూర్తి వాడకంలోకి తీసుకురాలేకపోయింది. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టీడీపీ చర్యలు తీసుకున్నా వైసీపీ ప్రజాప్రతినిధులు దాన్ని తుంగలోకి తొక్కేశారు.


అధ్వానంగా ఉన్న రాజపూడి-మన్యంవారిపాలెం రోడ్డు

ఒక్క రోడ్డు అభివృద్ధి చేయలేదు

టీడీపీ హయాంలో సర్వీస్ రోడ్లు, సీసీ రోడ్లు, మెయిన్‌రోడ్లను అభివృద్ధి చేశారు. ప్రతి గ్రామం, ప్రతి వీధిలో రోడ్డు సదుపాయం ఉండేలా టీడీపీ చర్యలు తీసుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క రోడ్డును అభివృద్ధి చేయలేకపోయింది. గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన అడపాదడపా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంది తప్ప పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదు. జగ్గంపేట మండలంలోని కొత్తూరు-బలభద్రపురం, కృష్ణాపురం-మన్యంవారిపాలెం, రాజపూడినుంచి మన్యంవారిపాలెం, రామవరం-గోనేడ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

తొలకరికి నీరందక ఎండిన పంటలు



-రైతు చిత్రపు వీరవెంకటేశ్వర్లు, సన్నకారు రైతు

రైతుకు కావాల్సింది ముందుగా సాగునీరు. వైసీపీ ప్రభుత్వం తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి సాగునీటిని అందించలేకపోయింది. సాగునీరందక తొలకరి పంటలన్నీ సగంలో ఎండిపోయాయి. ఎకరానికి రూ.50వేలు నష్టం వాటిల్లింది. నీరందక రైతులంతా నష్టపోయారు.

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా రామకృష్ణారెడ్డి?

- ఐక్యంగా ముందుకెళుతున్న కూటమి
- అభ్యర్థి అతనే మారనున్న కండువా
- నేడు స్పష్టమైన ప్రకటన


రామవరంలో నల్లమిల్లితో చర్చిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) ఏప్రిల్ 21/అనపర్తి: కూటమి సమన్వయంతో వెళుతుందనడానికి అనపర్తి టికెట్ ఉదాహరణ. ఎక్కడికక్కడ.. ఒకరికొకరు సర్దుకుపోతూ ఐక్యత చాటుతున్నారు. అనపర్తి సీటు విషయంలో టీడీపీ-బీజేపీ ఒక ఒప్పందానికి వచ్చినట్టు సమాచారం.ఈ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేయనున్నారు. తొలి జాబితాలోనే టీడీపీ అభ్యర్థిగా ఆయన పేరును చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ పొత్తులవల్ల బీజేపీకి అనపర్తి సీటు వెళ్లిపోయింది. దీంతో అనపర్తి బీజేపీ అభ్యర్థిగా కృష్ణంరాజును ప్రకటించారు. కానీ ఇక్కడ బలమైన నేతగా ఉన్న రామకృష్ణారెడ్డి వర్గం తీవ్ర అసంతృప్తికి గురికావడంతో పాటు, ఇక్కడ బలహీనంగా ఉంటే లోక్‌సభ సీటుపై కూడా ప్రభావం చూపుతుందని కూటమి భావించింది. ఈ సీటు మార్పునకు ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు టీడీపీ అభ్యర్థిగా ప్రకటితమైన, సీనియర్ టీడీపీ నేత రామకృష్ణారెడ్డికి బీజేపీ కండువా కప్పి కూటమి అభ్యర్థిగా బరిలోకి దించడానికి నిర్ణయం తీసుకున్నారు. మా కుటుంబం 40 ఏళ్ల నుంచి టీడీపీ గుర్తుతోనే రాజకీయాలు చేస్తోందని రామకృష్ణారెడ్డి మొదట వ్యతిరేకించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యం చేసుకుని శనివారంరాత్రి స్వయంగా రామకృష్ణారెడ్డికి ఫోన్‌చేసి కూటమిలో అందరూ ఒకటే. పైగా నీవు కావాలని పార్టీ మారలేదు. కూటమి నేతలంతా చెబుతున్నారు కదా! ధైర్యంగా ముందుకెళ్లండని చెప్పడంతో రామకృష్ణారెడ్డి ఒకే చెప్పేశారు. కేడర్‌ను పిలిచి మరీ చెప్పేశారు. ఇదే సమయంలో బీజేపీ అధిష్ఠానం కూడా అక్కడ బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజుకు సమాచారం తెలియజేసింది. దీంతో అనపర్తి బీజేపీకే ఉంది. టీడీపీ నేతే ఇక్కడ అభ్యర్థి అయ్యారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తన ప్రచార రథాలపై రామకృష్ణారెడ్డి ఫొటోను ఇప్పటికే పెట్టేయడం గమనార్హం. ఇక కొన్ని లాంఛనాలు జరగవలసి ఉంది. రామకృష్ణారెడ్డి పేరును జిల్లా కమిటీ ప్రతిపాదించి, రాష్ట్ర కమిటీకి పంపడం, అక్కడ నుంచి కేంద్ర కమిటీకి వెళ్లడంతో రేపోమాపో అధికారికంగా ప్రకటన వస్తుంది. 23వతేదీనరామకృష్ణారెడ్డి నామినేషన్ వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం : నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 21 : చంద్రబాబు నిర్ణయం మేరకు తాను పనిచేస్తానని హామీ ఇచ్చానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామవరంలోని నల్లమిల్లి నివాసానికి ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు చేరుకుని నల్లమిల్లితో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కొద్దిసేపు చర్చించారు. నల్లమిల్లి కుటుంబంతో తనకు ఉన్న సాన్నిహిత్యంతో ఈ రోజు రామకృష్ణారెడ్డి కలిసేందుకు వచ్చానన్నారు. కూటమి అభ్యర్థిగా అనపర్తిలో నల్లమిల్లి పోటీ చేస్తారని బీజేపీ తరఫున నల్లమిల్లి విజయానికి ప్రచారం చేస్తామన్నారు. సీటు విషయంపై సోమవారం స్పష్టమైన ప్రకటన వస్తుందన్నారు. నల్లమిల్లి వెంట ఆయన తనయుడు మనోజ్‌రెడ్డి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నటుడు పృధ్విరాజ్

కండువా వేసిన రోజే

జగన్ కనబడతారు

- జగన్మోహన్‌రెడ్డి కాదు...ఆయన బటన్ రెడ్డి
- రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమే: నటుడు పృథ్వీరాజ్

పి.గన్నవరం, ఏప్రిల్ 21: వైసీపీ వాడుకుని వదిలేసే రకం..కండువా వేసిన రోజునే మనకు కనబడతారు. తరువాత వైసీపీకి అడ్డం వచ్చిన వారిని, ఇది తప్పు అని చెప్పినా సంబంధిత వ్యక్తులను ఏదోరకంగా వారిని పార్టీ నుంచి బయటకు పంపించేస్తారు. ఇది వైసీపీ జగన్ నైజం అంటూ నటుడు, జనసేన నాయకుడు పృధ్వీరాజ్ వైసీపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. పి.గన్నవరం జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, స్థానిక కూటమి నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు దోచుకో దాచుకో అన్న నినాదంతో పని చేశారని మండిప డ్డారు. సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తారని అసత్య ప్రసారాలు చేస్తున్నారని కౌలు రైతులకు సైతం పవన్‌కళ్యాణ్ తన సొంత డబ్బు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అవసరమైతే పది రూపాయలు పెంచి మరీ సంక్షేమ పథకాలు ఇస్తామని కూటమి నేతలు చెబుతున్నారని ఆయన స్పష్టం చేశారు. జగన్ అనే వ్యక్తి వీధికి ఒకడు ఉంటే పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తి రాష్ట్రానికి ఒక్కడే ఉంటాడన్నారు. సిద్ధం అంటూ తిరుగుతూ ఓడిపోవడానికి సిద్ధంగా ఉన్నారని మనం యుద్ధం అంటూ గెలవడానికి యుద్ధం చేస్తున్నామన్నారు. ఇక రాష్ట్రంలో వారి ఆటలు సాగవని ఉమ్మడి మేనిఫెస్టోతో వస్తున్న కూటమిదే విజయమని టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అవుతారని ఆయన జోస్యం చెప్పారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో తిరుమలను అవినీతిమయం చేశారని దోపిడీదారులు, దుర్మార్గులు చేరిపోయారన్నారు. కూటమిలో భాగంగా అన్ని పార్టీల ఓట్లు కూటమి అభ్యర్థికి బదిలీకావాలని ఆదిశగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మెగాస్టార్ చిరంజీవి ఎన్‌డీఏ కూటమికి మద్దతు పలకడం ఆనందంగాఉందని త్వరలో ఆయన ప్రచారానికి వచ్చే అవకాశం ఉందన్నారు.

కాపు నాయకుడు కాదు..రెడ్డి సేవకుడు

ముద్రగడ కాపు నాయకుడు కాదని రెడ్డి సేవకుడని నటుడు పృధ్విరాజ్ ఫైర్ అయ్యారు. వైసీపీ వారు వాడుకుని వదిలేస్తారని ముద్రగడకు అర్థం కావడంలేదన్నారు. సినిమా నటుల్ని తరిమికొట్టాలని ముద్రగడ వ్యాఖ్యానిస్తున్నారని అన్న ఎన్టీఆర్ హయాంలో ఆయన మంత్రిగా పనిచెయ్యలేదా అని ఆయన ప్రశ్నించారు. అన్ని కులాల వారు అసెంబ్లీకి వెళ్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆ సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, గణపతి రాఘవులు పాల్గొన్నారు.

అంబటిని సంక్రాంతి సంబరాలకు పిలుద్దాం

ఎన్నికల్లో అంబటి ఎలాగో ఓడిపోతారు. రాబోయే సంక్రాంతి సంబరాలకు, కోడిపందెలకు కోనసీమకు పిలుద్దాం. భోగిమంటలు చుట్టూ తిరిగి డ్యాన్స్ చేసిపోతారు. మాజీ మంత్రి కదా..ఒకో లక్ష ఇప్పిద్దాం. మనవారికి చెబితే బుక్ చేస్తారు.

సత్యదేవుడి సన్నిధిలో

నేడు అపురూప ఘట్టానికి నాంది

- నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ
- త్వరలో స్వర్ణమయం


యాగాలు నిర్వహిస్తూ, ధాన్యాధివాసం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 21 : రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మరో అపురూప ఘట్టానికి నాంది పలకనున్నారు. సుమారు శతాబ్దంపాటు నిలిచిఉండే విధంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా జరుగనుంది. దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చేతులమీదుగా సోమవారం ఉదయం 10.48కి ధ్వజస్తంభ ప్రతిష్ఠ గావిస్తారు. ఈనెల 18 నుంచి చేపడుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రుత్విక్‌లు సర్వదేవతలకు హోమాలు, జపములు, ఆరాధనలు నిర్వహించి ధ్వజానికి ధాన్యాధివాసము గావించారు. చతుర్వేద పండితులు వేదస్వస్తి పలికారు. నేడు ప్రతిష్ఠ అనంతరం త్వరలోనే ధ్వజస్తంభానికి రాగిరేకు అమర్చి దానిపై బంగారుపూత చేయనున్నట్లు దాత తెలిపారు. సుమారు రూ.4కోట్ల వ్యయం కానున్నట్లు అధికారులు తెలిపారు.

వాడపల్లిలో ఘనంగా సదస్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 21: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం స్వామివారి మేల్కొలుపు, నిత్యార్చన, హోమాలు, దిగ్దేవతా బలిహరణ, ద్రవిడవేద పారాయణం లను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, అష్టదిక్పాలక ఆరాధన, సదస్యం కన్నుల పండువగా జరిగాయి. వసంత మండపంలో స్వామివారికి చతుర్వేద పండితులు మహాదాశీర్వచనం ఇచ్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేంద్రవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు కల్యాణోత్సవ పూజలు నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ సమర్పించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగా నో ఆకట్టుకున్నాయి. మహిళల కోలాటం అలరించింది.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా జంగా గౌతమ్



అమలాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ (ఎస్సీ రిజర్వ్‌డ్) కాంగ్రెస్ అభ్యర్థిగా జంగా గౌతమ్‌ను ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. గౌతమ్ ప్రస్తుతం ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి అత్యల్ప తేడాతో ఓటమి చెందారు. మెగాస్టార్ చిరంజీవితో సన్నిహితంగా పనిచేసిన గౌతమ్ ఆయనతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత అమలాపురం అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా గౌతమ్‌ను కాంగ్రెస్ ఎంపిక చేసింది. 2019లో అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీ చేశారు.

మరణంలోను మరో ఇద్దరికి కంటి చూపు

- చిరుసేవాసమితి స్ఫూర్తితో రామకృష్ణ కుటుంబసభ్యుల నేత్రదానం


నరమామిడి రామకృష్ణ (ఫైల్)

కడియం, ఏప్రిల్ 21: మరణంలోనూ ఇద్దరికి చూపు నిచ్చారు ఆయన. చిరుసేవామితి స్ఫూర్తితో మృతుని కుటుంబసభ్యుల అనుమతితో నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ కు దానం చేశారు. తాను మరణించినా మరో ఇద్దరికి చూపు నివ్వగలిగారు.. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరిజిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన నరమామిడి రామకృష్ణ(53) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. చిరంజీవి సేవాసమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గెడ్డం శివరత్నగణపతి(శివ) ఆధ్వర్యంలో చిరంజీవి సేవాసమితి సభ్యుడు అయిన సుబ్రహ్మణ్యం తన తండ్రి కళ్లను దానం చేయాలని తద్వారా మరో ఇద్దరికి చూపునివ్వాలనుకున్నాడు. విషయాన్ని గెడ్డం శివకు తెలిపారు. దీంతో మృతుడు రామకృష్ణ కుమారుడు, చిరంజీవి సేవాసమితి సభ్యుడు నరమామిడి సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యుల సహకారంతో, వారి అంగీకారంతో మృతుడు రామకృష్ణ నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి సేవాసమితిని, రామకృష్ణ కుటుంబ సభ్యులను నూనె ప్రభు, నరమామిడి అంజనేయులు, కానుబోయిన నాగేశ్వరరావు, ఆదిమూలం రామకృష్ణలతో పాటు పలువురు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న

ఇద్దరు మైనర్లు అరెస్ట్

గండేపల్లి, ఏప్రిల్ 21: స్కూటీ మోటార్ సైకిల్ డిక్కీలో రహస్యంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు మైనర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్‌లు గంజాయికి బానిసై తునిలో గుర్తు తెలియని వ్యక్తివద్ద కిలో గంజాయి కొనుగోలుచేసి స్కూటీ డిక్కీలో పెట్టుకుని విజయవాడ వైపు వెళుతుండగా శనివారంరాత్రి తాళ్లూరు దాటిన తర్వాత వాహనాలు తనిఖీలు చేస్తున్న గండేపల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకుని గండేపల్లి ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధువులు కళ్లల్లో కారం చల్లారు...

- యువతి ఫిర్యాదు

కడియం, ఏప్రిల్ 21: తన బంధువులు కిడ్నాప్ చేయబోయారంటూ ఓ యువతి ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా గొడిగనూరు గ్రామానికి చెందిన గంగవరం స్నేహ, కడియం గ్రామానికి చెందిన బత్తిన వెంకటనందులు నరసారావుపేట కళాశాలలో వెటర్నరీ డిప్లమో చదువుకునే సమయంలో ప్రేమలో పడ్డారు. ఈనెల 13న విజయవాడ వెళ్లి కనకదుర్గ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని నందు తల్లిదండ్రులు అంగీకరించారు. స్నేహ తన తల్లిదండ్రులకు కూడా తెలిపారు. ఆదివారం కడియంలోని ఓ ఫంక్షన్‌హాలులో స్నేహ, నందుల వివాహ వేడుకకు స్నేహ బంధు వులు కడియం వచ్చారు. ఈ సమయంలో పద్మావతి, చరణ్‌కుమార్, చందు, ఎస్.భరత్ అనే వారు ఫంక్షన్ హాలులోకి ప్రవేశించి ఫిర్యాదు దారు స్నేహ కళ్లలోకి, ఇతరుల కళ్లల్లోకి కారం చల్లారు. స్నేహను ఆమె భర్త వెంకటనందు రక్షించాడు. ఈ సంఘటనలో బత్తిన వీరబాబు అనే వ్యక్తికి తల, నుదురు, ముక్కుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్నేహ ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థ యాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాసరావు

కె.గంగవరం, ఏప్రిల్ 21: తీర్థ యాత్రలకు బయలు దేరిన కుటుంబంలో విషాదం నెలకొంది. ఏలూరు జిల్లా లింగంపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన నంద్యాల శ్రీనివాసరావు(27), తన సోదరి సుజాత, ఆమె కుటుంబ సభ్యులతో కలిసి తీర్థ యాత్రలకు బయలుదేరారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, కోటిపల్లి దేవాల యాలను సందర్శించి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆది వారం కోటిపల్లి నుంచి ద్రాక్షారామ భీమేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆటోలో వెళుతున్నారు. కె.గంగవరం మండలం కుందూరు గ్రామం తాడిగొయ్యి సెంటర్‌లో ఆటోకు అడ్డంగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సుజాతకు, కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జానీబాషా తెలిపారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని మృతిచెందిన నాగిరెడ్డి

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 21: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలువద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకన్నబాబు(45) మోటార్‌సైకిల్‌పై ఇంటివద్ద నుంచి చేబ్రోలు శివారు సత్తెమ్మతల్లి గుడి వద్ద జరిగే కార్యక్రమానికి బయలుదేరారు. బైపాస్ రోడ్డులోని పెద్ద చెరువు వద్దకు వచ్చేసరికి ఎండతీవ్రతకు అస్వస్థతకు గురై బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన అతనిని 108 అంబులెన్స్‌లో తొలుత పిఠాపురం ఆసుపత్రికి, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగబాబుకు ఘన స్వాగతం

కొత్తపల్లి, ఏప్రిల్ 21: పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం యండపల్లిలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుకు ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వినాయకుడి గుడి సెంటర్ దగ్గర ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన ప్రసంగించారు. వైసీపీ నాయకుల రాక్షసపాలన రాష్ట్రంలో ప్రతిపౌరుడిని విసుగు చెందించిందని, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వంతో అభివృద్ధితో కూడిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. ప్రజలకు సేవ చేయడానికి పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం ఎంచుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం

అధ్యక్షురాలిగా జయలక్ష్మి


ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 21 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షురాలిగా వి.జయలక్ష్మి ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడలో వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం కార్యవర్గ ఎన్నికలు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన సంఘం అధ్యక్షుడిగా జయలక్ష్మి, జాయింట్ అధ్యక్షుడిగా కె.బృంద, ఉపాధ్యక్షులుగా ఎండీ అమీర్ జానీ, బి.నాగేశ్వరరావు, ఎం. వెంకటలక్ష్మి, కార్యదర్శిగా డి. భైరవమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి కె.నాగబాబు, కె. జై దివ్య, సహాయ కార్యదర్శులుగా ఎం. సందీప్, కృష్ణంరాజు, కోశాధికారి వి.గోవిందరాజు, ఈసీ మెంబర్లుగా శ్రీనివాసరావు, పీఎస్ ప్రసాద్‌తో పాటూ ఆరుగురుని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘం కార్యదర్శి డీఎస్ఎన్‌శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా వెన్న రమేష్, పరిశీలకులుగా పీవీ సాయికుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఈవో సంఘం అధ్యక్షుడు వేణుమాధవరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

విషాదం నింపుతున్న విహారం

మృత్యుకుహరంగా మారుతున్న పొల్లూరు జలపాతం



పొల్లూరు జలపాతం జలధార

మోతుగూడెం, ఏప్రిల్21: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు జలపాతం మృత్యు కుహరంగా మారింది. విహార యాత్రలకు వచ్చి సరదాగా స్నానానికి దిగిన వారిని మింగేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 15 మంది, కొత్తగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిన తర్వాత 20 మందికి పైగా మృతి చెందారు. మృతుల్లో ఎక్కువ మంది తూర్పు, పశ్చిమగోదావరి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే ఉన్నారు.

● ఎన్నో విషాదకర సంఘటనలు

సహజ ప్రకృతి అందాలను వీక్షించేందుకు ఇటీవల కాలంలో పొల్లూరు జలపాతం వద్దకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. అయితే జలపాతం కొండపైన సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సరదాగా గడుపుదామని వచ్చినవారిని పొల్లూరు జలపాతం మింగేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ జలపాతాలు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. జలధార వద్ద సరదాగా జలకాలాడుతూ నీట మునిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు పర్యాటకులు మద్యం మత్తులో వచ్చి మృత్యువును కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటి వరకు ఈ జలపాతం వద్ద మృతి చెందినవారిలో యువకులే అత్యధికంగా ఉన్నారు. ఈ సంవత్సరం 2024 మార్చి 31 పొల్లూరు కొండపై జలపాతంలో కాలుజారి యువకుడు వైకొండయ్య మృతి చెందాడు. అతను రంగంపేట మండలం సింగంపల్లి గ్రామ లిక్కర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు.

● నీటిలోతు అంచనా లేక

పొల్లూరు జలపాతం వద్ద నీటి లోతును అంచనా వేయడం చాలా కష్టం. ఎక్కడో కొండ ప్రాంతాల నుంచి వచ్చే నీటి ప్రవాహం ఎత్తైన ప్రదేశం నుంచి జాలు వారుతూ ఉంటుంది. జల ప్రవాహం లోతును ఇప్పటి వరకు స్థానికులు సైతం అంచనా వేయలేకపోతున్నారు. సుడులు తిరిగే నీటి ప్రవాహంలో బండలు మధ్య సొరంగాలు ఉంటాయని చెప్తున్నారు. గజ ఈతగాళ్ల సైతం నీటి ప్రవాహాన్ని తట్టుకుని ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పట్టణాలు, నగరాల నుంచి వచ్చే యువకులు ప్రవాహాన్ని లోతును అంచనా వేయలేక నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈతకొట్టే వారు సైతం ఈ జలపాతం లోతును అంచనా వేయలేక పోతుండడం విశేషం. పొల్లూరు జలపాతం ఒక మడుగులా ఉంటుంది. సుమారు 20 అడుగులు లోతు ఉండడంతో పాటు ఒడ్డు దగ్గర ఉండే పెద్ద రాళ్ల మధ్యలో సొరంగం మాదిరి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

● సెల్ఫీలతోనే ప్రమాదం

జలపాతాలు చూడడానికి వచ్చి సెల్ఫీలు దిగే సమయంలో జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే మందుబాబులు మద్యం సేవించి జలపాతం ప్రవాహంలోకి దిగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు.

హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం

మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు

జలపాతం దగ్గర కొండపైన గ్రైడును నియమించి బారికేడ్‌లు, ఇనుస మెస్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కొండపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులను అప్రమత్తం చేస్తాం

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్షలు

రంపచోడవరం, ఏప్రిల్ 21: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8,9వ తరగతులలో బ్యాక్‌లాగ్ వేకెన్సీలకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల కన్వీనర్ ఎస్.కె.అహ్మద్ అలీషా తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 5వ తరగతిలో 735 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 608 మంది హాజరయ్యారని, 6వ తరగతికి 454 మందికి గాను 316 మంది, 7వ తరగతికి 48 మందికి గాను 39 మంది, 8వ తరగతికి 54 మందికి గాను 39 మంది, 9వ తరగతికి 24 మందికి గాను 17 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు.

పాపికొండల విహారయాత్రకు సందర్శకులు

దేవీపట్నం, ఏప్రిల్ 21: పాపికొండలు విహారయాత్రకు ఆదివారం మూడు బోట్లలో సుమారు 200 మంది పర్యాటకులు వెళ్లారు. రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులు పోశమ్మగండి బోట్‌పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాల మీదుగా వెళ్లారు. ముందుగా గండి పోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పయనమయ్యారు.

గండిపోశమ్మ ఆలయంలో రద్దీ



గండి పోశమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

దేవీపట్నం, ఏప్రిల్ 21: మండల పరిధిలో వేంచేసియున్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వేకువజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి సంబంధించి టిక్కెట్లు తదితర విక్రయాల ద్వారా రూ.20 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చిన్ననల్లకుంటలో అగ్నిప్రమాదం

రెండు పూరిళ్లు దగ్ధం..రూ.3 లక్షల నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

ఎటపాక, ఏప్రిల్ 21: ఎటపాక మండలం, చోడవరం పంచాయతీలోని చిన్ననల్లకుంట గిరిజన గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి, రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో మొత్తం రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. సాయంత్రం సమయంలో ఈదురుగాలులు వీయడంతో సమీపంలో చెత్తకు పెట్టిన నిప్పు ప్రమాదవశాత్తు ఎగిరి వెట్టి ముత్తయ్య తాటాకు ఇంటికి అంటుకుంది. ఆ మంటలు పక్కనే ఉన్న పెనుబల్లి కాటయ్య ఇంటికి కూడా అంటుకున్నాయి. దాంతో రెండు పూరిళ్ల క్షణాల్లో కాలిబూడిదయ్యాయి. ఇంట్లోని గృహోపకరణాలు, వస్తువులు, ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం ఆస్తినష్టం రూ.3 లక్షల వరకు జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. అయితే స్థానికులు ప్రమాదంపై స్థానిక వీఆర్వోకు సమాచారం అందించినా, ఆయన స్పందించలేదని, బాధితులకు ప్రభుత్వం తరపున అందించే తక్షణ సాయం అందించకపోగా, ఈరోజు రావడం వీలుపడదని వీఆర్వో చెప్పారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

గోకవరం, ఏప్రిల్ 21: జగ్గంపేటలో ఈనెల 22వ తేదీన జరుగనున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు మంగరౌతు రాము, పాటూరి బోస్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ చంద్రబాబు రోడ్ షోను విజయవంతం చేసేందుకు మండలం నలు మూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పరిశ్రమల స్థాపన కూటమితోనే సాధ్యం

● ప్రచారంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న రూరల్ అభ్యర్థి గోరంట్ల



శాటిలైట్ సిటీ సీ బ్లాక్‌లో ఎన్నికల ప్రచారంలో గోరంట్ల, ఆయన అల్లుడు కంఠమనేని మురళీకృష్ణ, కుమార్తె శిరీష

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: రాష్ట్రంలో పరిశ్రమలు పెద్దఎత్తున స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ వార్డులలో ఆదివారం ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో ప్రజలు, మహిళలు, కార్మికులు, కర్షకులు, కూలీలు, చిరువ్యాపారులను గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష, టీడీపీ నాయకులతో కలిసి సూపర్ సిక్స్ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు పూర్తిగా దెబ్బతిందన్నారు. దివాలా తీసిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి కూడా ఎవ్వరూ ముందుకు రాక పరిశ్రలు కొత్తవి రాక నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రాజధాని లేదు, సహజవనరులు దోచుకోవడంతో సుభిక్షంగా ఉండాల్సిన రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. ఇసుక, మట్టి అక్రమ దోపిడీలు, చీప్ లిక్కరు మాటున పెద్దఎత్తున దోపిడీ చేశారని ఆరోపించారు. వ్యవసాయం పూర్తిగా నిర్లక్ష్యానికిగురై రైతులు దీన స్థితిలో ఉన్నారని అన్నారు. పట్టణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించలేక పోయారని, ప్రజలు అనారోగ్యాల పాలై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. రాష్ట్రాన్ని ఒక విజనరీతో ముందుకు తీసుకురాగల సత్తా, కార్యదీక్ష చంద్రబాబుకే ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా పోటీచేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, రూరల్ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, పిల్లా తనూజా, మణి, చాలుమూరి తాతారావు, దాలిపర్తి వేమన, రొంపిచర్ల ఆంటోని, బంగారు రాజు, నిమ్మలపూడి గోవింద్, బూరా దుర్గా ఆంజనేయులు, యర్రమోతు ధర్మరాజు, శీలం గోవింద్ పాల్గొన్నారు.

● శాటిలైట్ సిటీ సీబ్లాక్‌లో ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం శాటిలైట్ సిటీ సిబ్లాక్‌లో తన అల్లుడు కంఠమనేని మురళీకృష్ణ, కుమార్తె కంఠమనేని శిరీషలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సదర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి కోతలు లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రిగా చంద్రబాబు అందిస్తారని చెప్పారు. ఇంతకాలం పడిన బాధలు భవిష్యత్‌లో లేకుండా సుస్థిరమైన పాలన అందిస్తారని చెప్పారు. కూటమి విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు ధారా అన్నవరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, పిల్లా తనూజా, మణి, నిచ్చిన కోళ్ళ సత్తిబాబు, పితాని వెంకటేశ్వరావు, గెద్దాడ కృష్ణ, దిగుమతి బెంజిమెన్, చౌడార్ లాజరు, బి. సరోజిని, టిక్యం మహేష్, మందపల్లి నూకరత్నం, పేట వీరలక్ష్మి, మద్ద మణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, ఏప్రిల్ 21: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సం దర్భంగా సుప్రభాత సేవ ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు ద్వారా రూ.1,10,714 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కాగా ఆలయ ఆవరవణలో కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొత్త తులసీ రామకృష్ణ వంద లీటర్ల పెరుగును చలివేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్‌తోపాటు ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

24 నుంచి వేసవి శిక్షణ శిబిరం

పెరవలి, ఏప్రిల్ 21: హిందూ ధర్మ సేవా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భారతీయ సనాతన ధర్మాన్ని సంస్కృతిని నేటితరం చిన్నారులకు చేరువచేయ డానికి బాల వికాస వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 8వ తేదీ వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. నల్లాకులవారిపాలెంలోని కొత్తపల్లి ఆర్యవైశ్య సేవా సంఘం భవనంలో ఈ శిబిరం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

ఆదరించండి..సేవకుడిగా ఉంటా

● 150 మంది నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరిక



నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరిన మాజీ సొసైటీ చైర్మన్ మంగరౌతు శ్రీను, తదితరులు

గోకవరం, ఏప్రిల్ 21: రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలకుడిగా కాకుండా, సేవకుడిగా పనిచేస్తానని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మాజీ సొసైటీ ఛైర్మన్ మంగరౌతు దుర్గా శ్రీనివాసరావు (శ్రీను)తో పాటు మరో 150 మంది ఆదివారం నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఆయన పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ కూటమి పట్ల నమ్మకంతోనే ప్రజలు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతాయన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మాయమాటలను మరోమారు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. జగ్గంపేటలో సోమవారం జరుగనున్న ప్రజాగళం సభకు మండలం నలుమూలల నుంచి అధికసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని నెహ్రూ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు మంగరౌతు రాము, పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, గాజింగం నాని, మండిగ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

హస్తంతోనే వ్యవస్థ సుభిక్షం

వాకర్స్‌తో కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గిడుగు, ఎమ్మెల్యే అభ్యర్థి బోడా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: హస్తంతోనే వ్యవస్థ సుభిక్షంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరంలో ఉదయం పార్కుల్లో వాకింగ్ చేసే వాకర్స్‌ను గిడుగు రుద్రరాజు, సిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీల కరపత్రాలు అందించారు. అక్కడ వాకర్స్‌తో న్యాయ్‌పత్రపై చర్చించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశం గాని, రాష్ట్రం గాని అభివృద్ధి చెందిందంటే కాంగ్రెస్ పభుత్వాల హయాంలోనేనన్నారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం వంటి పనులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమౌతాయన్నారు. ప్రజలందరు, ఎంపీగా తనను, సిటీ ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌ను గెలిపించాలని కోరారు. అదేవిధంగా జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నగరంలో చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొండలరావు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కూనపురెడ్డి శ్రీనివాస్, చింతాడ వెంకటేశ్వరావు, బిడ్డర్ బాబీ, శివాజీ, శర్మ పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న గిడుగు, బోడా

మోడల్ సిటీగా రాజమహేంద్రవరం

» నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో అవకాశాలు
» కూటమితోనే ప్రజారంజక పరిపాలన
» ఇంటింట ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి



ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: జనరంజక పరిపాలన కూటమితోనే సాధ్యపడుతుందని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 36వ డివిజన్‌లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు, ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమహేంద్రవరం పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి దూరమయ్యారని వారి పరిస్థితులను చూస్తే ఎవ్వరికైనా అర్థమౌతుందన్నారు. ప్రజల బతులు బాగుపడాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు పూర్తి స్థాయిలో కల్పించాలన్నా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చాలన్నా కూటమి అధికారంలోకి రావాలని, చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని ఒక మోడల్ సిటీగా ప్రపంచానికి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నాశిరకం పనులు, కమిషన్ల కోసం కక్కుర్తి పడి ఎంపీ భరత్‌రామ్ నగరాన్ని సుందరీకరణ అంటే లైట్లు వేసాడని దానినే అభివృద్ధి అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కాని విజ్ఞులైన రాజమహేంద్రవరం ప్రజలు అతన్ని తిరస్కరించబోతున్నారని చెప్పారు. తాము భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నామని వాసు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చిరువ్యాపారితో మాట్లాడి ఓట్లు అభ్యర్థిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

ఆదిరెడ్డిని గెలిపించాలంటూ విస్తృత ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో పలు డివిజన్లలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వార్డుల్లో ఇంటింట ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరం సమగ్ర అభివృద్ధికి వాసు రూపొందించిన లోకల్ మెనిఫెస్టో ఎంతగానో దోహదపడుతుందని, చంద్రబాబు సూపర్ సిక్స్ పతకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని వారు ప్రజలకు వివరిస్తున్నారు. హెల్త్ డిక్లరేషన్, టూరిజం హబ్, స్పోర్ట్ కాంప్లెక్ నిర్మాణాలు, మహిళల రక్షణ దళం తదితర అంశాలతో ప్రజలకు మంచి పాలన నగరంలో అందిస్తారని చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేస్తారన్నారు. రాజమహేంద్రవరాన్ని ప్రగతి పథంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ నడిపిస్తారని చెప్పారు. ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, కొయ్యల రమణ, యిన్నమూరి దీప్తి, మరుకుర్తి రవియాదవ్, నక్కా దేవి వరప్రసాద్, యాళ్ళ ప్రదీప్, దాస్యం ప్రసాద్, కందికొండ అనంత్, చాపల చిన్న రాజు, మాలే విజయలక్ష్మి, కోసూరి చండిప్రియ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దానవాయిపేటలోని ఏఈఎల్‌సీ సెయింట్ పీటర్స్ చర్చిలో కిమ్స్ (బొల్లినేని) ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బిషప్ విజయ్ ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 350 మందికి కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్స్ తదితర వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసినట్టు ఆస్పత్రి సీఈవో డాక్టర్ ఎన్ఎస్ రామ రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి బీజేపీ ప్రాధాన్యం

ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 21: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మిక సంఘ్ నాయకులు అర్జునరావు, బి.కల్యాణి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్‌కు పూర్తి స్థాయిలో సన్నద్ధం

రాజమహేంద్రవరం సిటీ రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్




రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ, వచ్చేనెల 13న జరిగే పోలింగ్‌లకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా కావాలని ఆర్‌వో దినేష్‌కుమార్ అన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి అసిస్టెంటు రిటర్నింగ్, నోడల్, బూత్ లెవెల్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో ఆదివారం వెబ్ ఎక్స్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఫారం-12 దాఖలుకు ఈనెల 26న ఆఖరు తేదీ అని చెప్పారు. జిల్లాలో ఇతర నియోజవర్గంలో ఓటున్న అధికారులు ఫారం-12 దాఖలు చేయాలన్నారు. ఫారం -12తో పాటు ఫొటో, డ్యూటీ సర్టిఫికెట్, ఎన్నికల విధి నిర్వహణ ఉత్తర్వులు సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం తెలియజేసిన వివిధ కార్యక్రమాలకు తేదీలను ఖరారు చేశామన్నారు. వచ్చేనెల 2న హోమ్ ఓటింగ్‌ను , 3 నుంచి 5వరకు ఈవీఎంల కమిషనింగ్ జరుగుతాయన్నారు. 6న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఇస్తామని, ఉదయం శిక్షణ పూర్తయ్యాక మధ్యాహ్నం ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగు జరుగుతుందన్నారు. 7న ఇతర పోలింగ్ అధికారులకు ఎన్నికల విధుల్లో ఉండే డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు తదితరులకు, 8న పోలీస్ డిపార్టుమెంట్, మైక్రో అబ్జర్వర్లకు ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటరుగా ఆర్ట్స్ కళాశాలలోని బుద్ధ భవనాన్ని ఎంపిక చేశామని అందులో ఎన్నికల విధులు నిర్వహించే అన్ని వర్గాలకు పోస్టల్ ఓటింగు చేపడతామని దినేష్‌కుమార్ చెప్పారు. ఇదేకాకుండా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మొదటి అంతస్తులో అత్యవసర సర్వీసులు వారికి పోస్టల్ బ్యాలెట్ దాఖలు చేయవచ్చని తెలిపారు. వచ్చేనెల 4 నుంచి 8వ తేదీ వరకు బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పులు అందజేస్తామని, 9 నుంచి సెక్టార్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పోలింగ్ స్టేషన్‌లో కావాలసిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. 10 నాటికి ఎన్నికల సామగ్రి మొత్తం పోలింగ్ స్టేషన్లకు సిద్ధపరుచుకుని, అన్ని పూర్తి చేసుకుని 13న జరిగే పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, తహశీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కందుల దుర్గేష్‌కు గన్ని కృష్ణ పరామర్శ



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరామర్శించారు. ఆదివారం నిడదవోలు వెళ్లి అక్కడ జనసేన పార్టీ కార్యాలయంలో దుర్గేష్‌ను పరామర్శించారు. దుర్గేష్ భార్య మరణించి కొద్ది రోజులు కాకుండానే ఆయన మాతృమూర్తి మరణించడంతో దుర్గేష్ పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. పార్టీ ఆయనపై పెట్టిన బాధ్యతను నిర్వహిస్తూ నిడదవోలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో గన్ని కృష్ణ పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య తదితరులున్నారు.



జగనన్నా.. ఇలా చేశావేంటన్నా..

బీమా చెల్లించక రైతులు నష్టపోయారు...



ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించకపోవడంతో వర్షాల సమయంలో రైతులు నష్టపోయారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సొసైటీల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీతో రుణాలు ఇచ్చేవారు. ఇప్పుడు ముందుగానే 7 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ అందలేదు. టీడీపీ ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేది.. జగన్ రూ.25 వేలు అందిస్తామని చెప్పి ఇప్పుడు రూ.15 వేలిస్తున్నారు. ఇటీవల జగన్ బటన్ నొక్కినా రైతులకు ఒక్క రూపాయి జమ కాలేదు.

- మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, అమలాపురం రూరల్

కాల్వలు ఆధునికీకరించక ఇబ్బందే..



పది ఎకరాల వరి పొలం సాగు చేస్తున్నా. మాగాం-అయినాపురం పంటకాల్వ ఆధునికీకరణ సక్రమంగా లేక రబీలో నీటిఎద్దడి ఎదుర్కొన్నాం. ఖరీఫ్‌లో అధిక వర్షాలతో ముంపు వల్ల నష్టపోతున్నాం. నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కౌలు రైతులకు రుణాలందిస్తామని ప్రకటనలు చేస్తున్నా వాస్తవంలో అమలు కావట్లేదు.

- కొప్పుల వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం

ఐదేళ్లుగా..డ్రెయినేజీలకు మోక్షంలేదు..



డ్రెయిన్లలో పూడిక తీసి పంట పొలాలను ముంపు నుంచి కాపాడాలని ఐదేళ్లుగా మొరపెట్టుకుంటున్నాం. అధికారులు ప్రతి ఏటా డ్రెయిన్లను పరిశీలించి పూడికతీతకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెబుతున్నారు. అయినా పని జరగడంలేదు. గత రెండేళ్లుగా సార్వాను వదిలేసుకున్నాం. దాళ్వాలోనూ మురుగునీరు దిగే మార్గం కనిపించక పంట నష్టపోతున్నాం. రైతు సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం డ్రెయిన్లను సకాలంలో ఆధునికీకరించడం లేదు.

- దోనిపాటి నాగేశ్వరరావు, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

బటన్ నొక్కారు సరే.. పరిహారమేదీ..



నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నా. గతంలో సంభవించిన తుఫాన్‌కు మొత్తం పంట నష్టపోయినట్టు అధికారులు నమోదు చేశారు. సీఎం బటన్ నొక్కినా ఇంతవరకూ పరిహారం అందలేదు. అష్టకష్టాలు పడి దాళ్వా పండించాను. ధాన్యాన్ని ఏవిధంగా కొనుగోలు చేస్తారోనని ఎదురు చూస్తున్నా.

- నయినాల కనకయ్యనాయుడు, మామిడికుదురు

తుఫాన్ నష్టమూ ఇవ్వలేదు...



మిచౌంగ్ తుఫాన్ కారణంగా నేను పదెకరాల్లో సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతింది. కోయడానికి కూడా పనికిరాకుండా పోయింది. నష్టపరిహారం అందిస్తామని అప్పట్లో అధికారులు, నాయకులు చెప్పారు. నెల రోజులు అన్నారు... నేటికీ అతీగతీ లేదు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- గన్ని శ్రీనివాస్, రైతు, పెనికేరు, ఆలమూరు మండలం

పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ప్రతి గింజను కొంటామని ప్రగల్భాలు పలికిన వైసీపీ అన్నదాతలకు మొండిచెయ్యే చూపింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. రైతులకు నడ్డి విరిచిన ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధిచెబుతాం. **- కొండపల్లి సూర్యనారాయణ, రైతు, జె.అన్నవరం, ఏలేశ్వరం**

సాగునీరందక తీవ్ర నష్టాలు...



ఈ ఐదేళ్లలో సాగునీరందక తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాం. తాళ్లూరు పుష్కర లిఫ్ట్‌ను నమ్ముకుని వ్యవసాయం చేస్తాం. అడపాదడపా వర్షాలు వచ్చినప్పటికీ పంట చేతికొచ్చే సమయంలో సాగునీరందక ఎండిపోతున్నాయి. వైసీపీలో ఎదుర్కొన్న నష్టాలను ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. **- గొల్లపల్లి బుల్లబ్బాయి, రైతు, మల్లేపల్లి**

అరటికి ప్రభుత్వ సహకారం లేదు



ఎన్నో ఏళ్లుగా అరటి సాగు చేస్తున్నా. గతంలో ధర బాగుండి ఎంతో కొంత లాభాలు వస్తుండేవి. గత నాలుగేళ్లుగా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. ప్రతి ఏటా ఎకరానికి రూ.30 వేల నుంచి 40 వేల వరకు నష్టం వస్తోంది. ప్రభుత్వ సహకారం లభించడం లేదు. **- మద్దిపాటి జానకి, అరటి రైతు, తీపర్రు, పెరవలి మండలం**

గోదావరి జిల్లాలంటేనే వ్యవసాయం గుర్తొస్తుంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలు కళ్ల ముందు మెదలుతారు. నిజానికి వ్యవసాయమంటేనే ఏటికి ఎదురీతలాంటిది. పెరిగిపోయిన పెట్టుబడులు, కూలీల కొరత ఓ వైపు, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు, సాగునీటి సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకో వైపు రైతులతో ఆటలాడుతుంటాయి. సాధారణంగా అనేక సమస్యలు చుట్టుముట్టినప్పుడు రైతు ఒడ్డున పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంటుంది. ధాన్యం కొనుగోలు ద్వారా, సాగునీటి సరఫరా ద్వారా ఆదుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు కోల్పోతే పంటల బీమాతో సాయం అందించేందుకు అభయమిస్తుంది. కానీ.. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను నిలువునా ముంచింది. ప్రతి గింజా కొంటున్నామని చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లని నిజమైన రైతులందరికీ ఆదిలోనే తెలిసిపోయింది. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనేసి మద్దతు ధర ఇచ్చేస్తున్నామని చెప్పడమూ అంతే మోసమని తేలిపోయింది. అమ్మిన ధాన్యానికి సొమ్ముల కోసం రైతన్నలు పడిన పాట్లను జన్మలో మర్చిపోలేరు. ఈ మొత్తం వ్యవహారం వెనుక దళారీలు, కొందరు మిల్లర్లు, ప్రభుత్వంలో కీలకమైన ప్రముఖులు ఆడిన నాటకంలో చివరకు దగా పడింది రైతన్నే. గోదావరి జిల్లాల్లో ఏటా సాగు నీటి సమస్యలు తప్పవు. అందుకు ఏ ప్రభుత్వమైనా అటు గోదావరి, ఇటు కాల్వల వ్యవస్థలను ఆధునికీకరణ చేస్తుండడం సర్వసాధారణం. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసింది సున్నా. సాగునీటికి ఈ క్షణం కూడా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల రైతుల పరిస్థితీ ఇంతే. రైతులకు ఈ ఐదేళ్లూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు.. ఐదు వేళ్లూ నోట్లోకి వెళ్లడమే కష్టం మారింది.. అందుకే ఎన్నికల సమయమిది...ఆలోచించాల్సిన తరుణమిది...!!

ఐదేళ్లూ.. నోట్లోకి.. వెళ్లలేదు!

అన్నదాతకు అష్టకష్టాలే..



రైతులతో జగన్ (ఫైల్)



చివరికింతే : ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెంలో ఏటా ఇంతే

- వైసీపీ సాగు..బాగా లేదు
- అన్నదాతలతో చెలగాటం
- ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకోలేదు
- పలకరింపునకూ నోచుకోలేదు
- ధాన్యం కొనుగోళ్లలో మాఫియా
- ఆధునికీకరణ ఊసేలేదు



సామర్లకోట, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వం అన్నదాతల జీవితాలతో ఆటలాడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం చేసే రైతులు గడిచిన ఐదేళ్లలో సాగుకు అష్టకష్టాలు పడ్డారు. ఒకపక్క తుఫాన్లు, అకాల వర్షాలు, వర్షాభావం రైతుల వెన్ను విరిచాయి. పెట్టిన పెట్టుబడులు దక్కక, ప్రభుత్వం ఆదుకోక అన్నదాతలు రోడ్డునపడ్డారు. పంటలు తుడిచిపెట్టుకుపోయి అప్పులపాలయ్యారు. మిచౌంగ్ తుఫాన్‌లో ధాన్యం తడిచి మొలకలు వస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోలేదు. పీకల్లోతు కష్టాల్లో మునిగిన అన్న దాతలను వైసీపీ నాయకులు పలకరించిన దాఖలా లేవ్. వ్యవసాయాధికారులు అరకొర నివేదికలు పంపినా నష్టపోయిన రైతులకు సొమ్ములు పడలేదు. ఏదోలా మిగిలిన వరి పంటను విక్రయించడానికి ప్రయత్నిస్తే అన్యాయమే జరిగింది. వైసీపీ పాలనలో ఐదేళ్లూ..

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎక్కడికక్కడ చేతులెత్తేసింది.ఆర్బీకేలకు అన్నదాతలు తెచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కొనకుండా నరకం చూపించింది. ధాన్యం డబ్బులకు ముప్పు తిప్పలు పెట్టింది. తేమ పేరిట ధాన్యాన్ని దళారులకు అమ్ముకునేలా చేసింది.ఇక రబీలో బొండాల రకం ధాన్యం నిషేధం పేరిట నష్టపరిచింది. రైతులకు యంత్ర పరికరాలు మంజూరులో విఫలమైంది. ఈ ఐదేళ్లలో అప్పుల భారం మరింత పెరిగి రైతులకు ఐదువేళ్లూ నోట్లోకి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. పంట కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరించక సాగునీటి ఇబ్బందులే. ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులకు, గోదావరి పరీవాహక ప్రాంత రైతులకు మధ్య నీటి యుద్ధాలు తప్పలేదు. చెరకు పంట వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని చక్కెర పరిశ్రమలు మూతబడ్డాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సగ్గుబియ్యం తయారీ పరిశ్రమలు సామర్లకోట, పెద్దాపురంలలోనే సుమారు 32 ఉండేవి. దుంప సాగు రైతులకు ప్రభుత్వం నుంచి ఏ సహకారం లేకపోవడంతో ఈ ఐదేళ్లలో సుమారు 18 సగ్గు బియ్యం మిల్లులు మూ తబడ్డాయి. దుంపసాగు కూడా చెరకు సాగు రీతిలోనే కనుమరుగవుతోంది.

అరటి రైతుకు లేదు బీమా ధీమా..


పెరవలి: అరటి గెలలకు రేటు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత నాలుగేళ్లుగా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు పది వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తుంటారు. ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి పెడతారు. వెదురు కొనుగోలుకు మరో రూ.50 వేల వరకు ఖర్చు. అంటే సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తారు. గెల ఒక్కింటికీ రూ.200 నుంచి 250 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే రైతుకు లాభసాటిగా ఉంటుంది. గత నాలుగేళ్లలో గెల ఒక్కటి రూ.100 నుంచి రూ.150 వరకు మాత్రమే ధర పలికింది. కొన్ని సమయాల్లో 100 కంటే తక్కువకే కొనుగోలు చేశారు. దీంతో అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోలేదు. చివరకు బీమా సొమ్ములు తమకు దక్కట్లేదని అరటి రైతులు ఆవేదన చెందుతున్నారు.

నర్సరీ రైతులకు చేసిందేమీ లేదు..



కడియం, ఏప్రిల్ 21: దేశవ్యాప్తంగా పేరొందిన కడియం నర్సరీ రైతులకు వైసీపీ ప్రభుత్వంలో చేసిందేమీ లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో కడియంను ప్రత్యేక హబ్‌గా గుర్తించి నర్సరీ రైతులకు సోలార్ పథకాన్ని అందించేవారు. ఈ మండు వేసవిలో నిరంతర విద్యుత్ అందక నానా అవస్థలు పడుతున్నారు. పాలీహౌస్‌లు, షేడ్ నెట్లు, సబ్సిడీపై సూక్ష్మబిందు సేద్యం, బ్యాటరీ స్ప్రేయర్లు వంటి పథకాలు రాయితీపై అందిన దాఖలాలు లేవు. అయినా ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కడియపులంకలో ఏర్పాటుచేసిన ఎకో టూరిజం కేంద్రం పునాదుల్లోనే ఆగిపోయింది. నర్సరీ రైతులను శాస్త్ర, సాంకేతికంగా అభివృద్ధిపరచాలనే ఉద్దేశంతో వేమగిరి శివారులో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఈ ఐదేళ్లలో నర్సరీ రైతులకు కష్టాలే మిగిలాయి..

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి 8



నేడు చంద్రబాబు రాక

జగ్గంపేట బహిరంగ సభకు సర్వం సిద్ధం

జగ్గంపేట, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటకు రానున్నారు. సాయంత్రం భారీ బహిరంగసభకు ఆయన హాజరుకానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.05 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి జగ్గంపేటలోని కోదూరి రంగారావు గ్రౌండ్‌లో హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి సామర్లకోట-గోకవరం రోడ్డు జంక్షన్‌కు చేరుకోనున్నారు. 3.30 గంటల నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 5.10 గంటలకు అక్కడి నుంచి హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో విజయనగరం బయలుదేరనున్నారు. జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జగ్గంపేట-గోకవరం రోడ్డులో హెలిపాడ్ పనులను తూర్పు ప్రోగ్రాం పరిశీలకుడు హనుమంతరావు పర్యవేక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. బహిరంగ సభ విజయవంతానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చర్యలు తీసుకుంటున్నారు.



రేపు పవన్‌కల్యాణ్ నామినేషన్

గొల్లప్రోలు నుంచి పిఠాపురం వరకు ర్యాలీ .. సాయంత్రం ఉప్పాడలో సభ

పిఠాపురం, ఏప్రిల్ 21: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 23న పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఉదయం పది గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసం నుంచి పవన్ బయలుదేరి గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల మీదుగా ప్రదర్శనగా పాదగయక్షేత్రం వద్దకు చేరుకుంటార న్నారు. అక్కడి నుంచి కాలినడకన పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఆర్వోకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. పవన్ నామినేషన్ ర్యాలీకి తరలివచ్చి, బహిరంగసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



జయం మనదే : చంద్రబాబు అందజేసిన బి.ఫారాలతో టీడీపీ అభ్యర్థులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి

విజయీభవ

అభ్యర్థులకు బి.ఫారాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : విజయీభవ! అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని కూటమి అభ్యర్థులను ఆశీర్వదించారు. టీడీపీ అభ్యర్థులకు ఆదివారం బి.ఫారాలు అందజేసి విజేతలుగా రావాలని సూచించారు. రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ అభ్యర్థి ఆదిరెడ్డివాసు, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం అమరావతి వెళ్లి చంద్రబాబు చేతుల మీదుగా బి.ఫారాలు అందుకున్నారు. కూటమి తరపున జనసేన నేతలు నిడదవోలు నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణలకు రెండు రోజుల కిందటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ బి.ఫారాలు అందజేశారు. రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తప్ప మిగతా కూటమి సభ్యులంతా ఇప్పటికే నామినేషన్లు దాఖలుచేశారు.లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.సోమవారం బత్తుల బలరామకృష్ణ; మంగళవారం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్లు దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉన్న సంగతి తెలిసిందే. అందులో కూటమి తరపున టీడీపీ నాలుగుచోట్ల, జనసేన రెండు చోట్ల, బీజేపీ ఒక చోట పోటీ చేస్తోంది. లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల వ్యయంపై దృష్టి పెట్టండి

రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయపరిశీలకురాలు నీనా నిగమ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఆదివారం వ్యయపరిశీలకులు,సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో ఖర్చుల వివరాలు, ఆడిటింగ్‌పై సమీక్షించారు. నామినేషన్ల పర్వం ఆరంభమైన నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. ఓటరు తన ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.ఎవరూ ప్రలోభ పెట్టకూడదని తెలిపారు. అభ్యర్థుల ఖర్చులన్నీ చూపడానికి నిష్పక్షపాతంగా సిబ్బంది వ్యవహరించాలన్నారు.బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తం నగదు డిపాజిట్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మద్యం అమ్మకాలు, స్టాక్ రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల ద్వారా వాహనాలు తనిఖీలు చేయాలన్నారు. రాష్ట్ర జిల్లా ఎక్సయిజ్ శాఖలు ఇంటెన్సివ్ తనిఖీ ద్వారా మద్యం చలామణిని నిరోధించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నగదు ప్రవాహాన్ని ఓటర్లు, అధికారులు కూడా పర్యవేక్షించాలన్నారు. వస్తువుల తనిఖీ సమయంలో జీఎస్‌టీ పన్ను కోసమే కాకుండా ఆ వస్తువులు ఓటర్లకు పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయేమో కూడా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్, ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్. డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 21: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు ద్వారా రూ.1,10,714 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కాగా ఆలయ ఆవరవణలో కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొత్త తులసీ రామకృష్ణ వంద లీటర్ల పెరుగును చలివేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్‌తోపాటు ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి శిక్షణా శిబిరం

పెరవలి, ఏప్రిల్ 21: హిందూ ధర్మ సేవా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భారతీయ సనాతన ధర్మాన్ని సంస్కృతిని నేటితరం చిన్నారులకు చేరువచేయడానికి బాల వికాస వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 8వ తేదీ వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. నల్లాకులవారిపాలెంలోని కొత్తపల్లి ఆర్యవైశ్య సేవా సంఘం భవనంలో ఈ శిబిరం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. శిబిరంలో హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణం, భగవద్గీత శ్లోకాలు, దేశ భక్తి గీతాలు, నీతి కథలు, నిత్య జీవితంలో ఉపయోగపడే శ్లోకాలతోపాటు వివిధ రకాలైన ఆటల పోటీలు నేర్పించనున్నట్టు చెప్పారు. తమ పిల్లలను పంపేందుకు ఆసక్తి గల వారు 81067 87769, 94414 00684 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నిడదవోలు పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్



నిడదవోలులో పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేంద్ర ప్రసాద్

నిడదవోలు, ఏప్రిల్ 21 నిడదవోలు పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా సిటీ కేబుల్(ఎస్‌సీఎస్ చానల్) అధినేత నీలం నాగేంద్ర ప్రసాద్‌ను ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పద్మశాలీ సంఘం సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని, సంఘంలోని పేదల విద్య, వైద్యానికి తగిన ప్రోత్సాహం అందిస్తానన్నారు. జనరల్ సెక్రటరీగా బండారు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా నందం సత్యనారాయణ, ట్రెజరర్ మంచి వీరవెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. మే 5న ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నామని పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు.

వేసవి ప్రతాపం



పెరవలి సెంటర్‌లో మధ్యాహ్నం సమయంలో తగ్గిన జన సంచారం

పెరవలి, ఏప్రిల్ 21: వేసవి తన ప్రతాపాన్ని చూపిస్తోంది. వారం రోజులుగా ఎండలు మండుతుండడంతో మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇంటికే పరిమితం అవుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. రెండుమూడు రోజులుగా 40 డిగ్రీలు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత ఎక్కువ అవుతుందని సమాచారం.

తాడిపర్రులో చలివేంద్రం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 21: మండలంలోని తాడిపర్రు గ్రామంలో వేసవిలో బాటచారుల దాహార్తిని తీర్చడానికి దాత గారపాటి సత్యనారాయణ తదితరులు ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. స్థానికులతోపాటు రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, నాయకులు కె.విజయచౌదరి, వాకలపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో అన్నదానం



కొవ్వూరు పాతపేట రామాలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 21: కొవ్వూరు పాతపేట రామాలయం వద్ద శ్రీరామనవమి ముగింపు వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగ ఆదివారం సీతారాములకు ఆలయ కమిటీ అధ్యక్షుడు గండ్రోతు కోదండ రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 21: మండలంలోని మోర్త-కానూరు 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో లైన్లు మరమ్మతుల నిమిత్తం ఈనెల 22, 23, 24 తేదీల్లో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మండలంలోని దమ్మెన్ను గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు.

నేడు నిడదవోలులో పురందేశ్వరి ప్రచారం

నిడదవోలు, ఏప్రిల్ 21: నిడదవోలు నియోజకవర్గంలో ఈ నెల 22వ తేది టీడీపీ-జనసేన-బీజేపీ రాజమండ్రి పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ప్రచారం నిర్వహించనున్నారు. విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పెండ్యాల, మునిపల్లి, సూర్యారావుపాలెం, వడ్లూరు, చివటం గ్రామాలలో ప్రచారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఎమ్మెల్యే కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొనున్నట్లు బీజేపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి సత్యనారాయణ తెలిపారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిడదవోలు, ఏప్రిల్ 21: పూరి నుంచి తిరుపతి వెళుతున్న రైలులో దివ్యాంగుల బోగిలో సుమారు 60 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీంతో శనివారం రాత్రి నిడదవోలు రైల్వేస్టేషన్‌లో మృతదేహాన్ని రైలు నుంచి దింపి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతిచెందిన వ్యక్తి యాచకుడిగా అనుమానిస్తున్నామని తెలిపారు.

మంగళగిరి తరలిన యువగళం టీం



తాళ్లపూడి, ఏప్రిల్ 21: మండలంలోని యువగళం టీం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన చంద్రబాబును మళ్లీ రప్పిద్దాం సమావేశానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీని బలోపేతం చేసే విధంగా యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజలకు ఏవిధంగా సంక్షేమ పథకాలు అందజేయాలో. ఏ విధంగా అభివృద్ధి చేయాలో క్షేత్రస్థాయిలో అందరికీ అర్థమయ్యేలా సమావేశం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి కృష్ణ, నాదెళ్ల శ్రీరాం, బొడ్డు కేశవకుమార్ పాల్గొన్నారని యువగళం టీం తెలిపింది.

'గాలి'హామీలు



గోపాలపురంలో పోలవరం కుడి ప్రధాన కాల్వ

- ఐదేళ్లలో అధికారం పక్షం ఇచ్చిన హామీలెన్నో
- ప్రకటనలకే పరిమితమైన పాలకులు
- మండిపడుతున్న గోపాలపురం నియోజకవర్గ ప్రజలు

గోపాలపురం, ఏప్రిల్ 21: మాటతప్పను మడమతిప్పను అనే మాటకు నిదర్శనం ఆ పార్టీ అధినేత జగన్‌నే చూపిస్తారు. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. గోపాలపురం నియోజకవర్గంలో నాడు జగన్ ఇచ్చిన హామీలతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు అన్ని గాలిలోనే కనిపిస్తున్నాయి. ఈ నాయకులకు మరోసారి ఓటు వేస్తే ఒరిగేదేమిటని నియోజకవర్గ ప్రజలు నిలదీస్తున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో పోలవరం కాల్వకు భూములిచ్చిన రైతులకు నెరవేర్చలేని హామీలు కోకొల్లలుగా ఇచ్చి మాటతప్పి, మడమతిప్పాడని రైతులు మండిపడుతున్నారు. తామేమి తక్కువ తినలేదన్నట్టు సాటి ఎమ్మెల్యేలు గాలిలో మేడల్లా ఉత్తుత్తి హామీలతో ప్రజలను ఉరకలు పెట్టించారు. తీరా ఎన్నికలు వచ్చే సమయానికి చేతులు ఎత్తేసి ఎన్నికల కోడ్‌ను కుంటిసాకుగా చూపిస్తూ నియోజకవర్గ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో అధికార పార్టీ ఐదేళ్ల పాలనలో ఒకటి రెండు కాదని హామీల హామీలు ఇచ్చి ప్రజలను నమ్మబలికారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటైన నెరవేర్చలేదనటానికి గోపాలపురంలో రూ.కోటితో అంబేడ్కర్ భవనం, అంబేడ్కర్ డిజిటల్ లైబ్రేరి, అగ్నిమాపక కేంద్రం, పోలవరం కుడి ప్రధాన కాల్వ, భూబాధితులకు రూ.5 లక్షలు పరిహారం ఇలా చెప్పుకుంటూ పోతే మండలానికి 30, గ్రామానికి 60 హామీలు గాలి మేడల్లోనే ఊగిసలాడుతున్నాయి. ఎన్నికల ముందు పదవీ కాంక్షతో ముందు వెనకా చూడకుండా హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక ప్రజలను మరోసారి బురిడి కొట్టించేందుకు కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. దీంతో పాటు దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఈఎస్ఐ వందపడకల ఆసుపత్రి నిర్మిస్తామంటూ ప్రజలను నమ్మించి మరోసారి ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నమ్మబలికే ప్రయత్నాలు చేస్తూ ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించారు. వారి ప్రయత్నం ఆదిలోనే హంస పాదు అన్నచందంగా మారింది. పంగిడి, గౌరీపట్నం గ్రామాల్లో పని చేస్తున్న క్వారీ, లారీ, క్రషర్ కార్మికులు, ప్రొక్లెయినర్ ఆపరేటర్లు సుమారు 20వేలకు మందికి పైగా పని చేస్తున్నారు. వారి ఓట్లు దండుకునేందుకు ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు అందుబాటులోకి తెస్తామంటూ చేసిన ప్రకటనలు గాలి మేడలుగా మిగిలాయి. ప్రకటనలకే పరిమితమైన పాలకులు అందుకు కావల్సిన స్థల సేకరణ చేయకపోవడం విడ్డూరం. పాద యాత్ర సమయంలో ఇచ్చిన హామీలకే దిక్కులేకపోగా మరోసారి ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని సిద్ధం సభలకు బస్సు యాత్రలు చేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

అగ్నిమాపక కేంద్రం ఊసే లేదు

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి మండలం ప్రస్తుత ఎమ్మెల్యే తలారి వెంకట్రావు స్వగ్రామమైన రామన్నపాలెం సమీపంలో ఆర్అండ్‌బీ స్థలంలో రూ.1.86 కోట్లతో అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తామంటూ హామీలు గుప్పించారు. ఆయన ఇచ్చిన హామీ కేవలం ప్రతిపాదనకే సరిపెట్టారు. నాటి నుంచి నేటి వరకు ఆ ఊసేలేదు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిగా పదవిపై వెళ్లారు. కానీ ఆయన ఇచ్చిన హామీ నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

గోపాలపురంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం

నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురంలో ప్రస్తుత ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అంబేడ్కర్ భవనం, అంబేడ్కర్ డిజిటల్ లైబ్రేరిని రూ.కోటితో నిర్మిస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆయన హామీ ఇచ్చి పదవీకాలం పూర్తవుతున్నప్పటికీ దానిని నెరవేర్చకపోగా గోపాలపురం ఆర్అండ్‌బీ స్థలంలో 83సెంటర్ల భూమిని సేకరించి ఆ భూమిలో 33సెంట్ల భూమిని అంబేడ్కర్ భవనానికి కేటాయిస్తూ తీర్మానాలు చేసి జిల్లా పరిషత్‌కు పంపించారు. హామీలు ఇవ్వడం అవి ప్రతిపాదనలతో సరిపెట్టుకోవడం ఆ ఎమ్మెల్యేకు పరిపాటిగా మారిందని, నెరవేర్చలేని హామీలు ఇచ్చి అంబేడ్కర్ అభిమానులను మరోసారి బురిడి కొట్టించారని మండిపడుతున్నారు.



గోపాలపురంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి సేకరించిన ఆర్అండ్‌బీ స్థలం



గుడ్డిగూడెం సమీపంలో పోలవరం కుడికాల్వ లాకులు

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు ఏమైంది?



గౌరీపట్నం పరిసర ప్రాంతాల్లో ఆయా రంగాల్లో సుమారు 20 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరు ఏదైనా అనారోగ్యం వచ్చిందంటే రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుకోవాలి. అయితే ప్రస్తుత పాలకులు ఈఎస్ఐ ఆసుపత్రిని గౌరీపట్నంలో ఏర్పాటు చేస్తామంటూ ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించారు. కానీ కొన్ని దశాబ్దాలుగా క్వారీల్లో పని చేస్తున్న కార్మికులకు క్వారీ యజమానులు మస్తర్లు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించిన పాలకులు కానరాలేదు. ఎన్నికల్లో ఓట్లు దండుకుని పబ్బం గడుపుకోవడానికే పాలకులు ప్రయత్నిస్తున్నారు. కార్మికులకు ఆన్‌లైన్‌లో మస్తర్లు అమలు చేయకపోవడంతో ఈ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి అవసరంలేదని ఇక్కడ కార్మికులు లేరని కేంద్రం నమ్మి ఆసుపత్రి మంజూరు చేయడం లేదనే నిజాన్ని పాలకులు చెప్పకపోవడం వెనుక ఆంతర్యమేమిటి. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే క్వారీ యజమానులు మస్తర్లు అమలు చేసేలా చూడాలి.

-ఎస్‌కే మస్తాన్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు.

భూ పరిహారం ఇవ్వలేదు



2006లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తక్కువ ధరలకు రైతుల దగ్గర నుంచి భూములు కొనుగోలు చేసి పోలవరం కుడికాల్వ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూములు కోల్పోయిన రైతులకు 2008లో ఆయా రెవెన్యూలో భూమి విలువను బట్టి ఎకరానికి రూ.70 వేలు నుంచి రూ.1.15 లక్షల వరకు జమ చేశారు. అమిత భూమి ఇచ్చిన రైతులకు రూ.5 లక్షల వరకు ఇస్తామంటూ ముఖ్యమంత్రి హోదాలో పలుమార్లు కొయ్యలగూడెం, చింతూరు, వేలేరుపాడు, కుక్కునూరు, తదితర ప్రదేశాల్లో జగన్ ప్రకటించారు. అయితే ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, భూమి పత్రాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఇవ్వాలంటూ రైతులను పరుగులుపెట్టించారు. దీంతో గోపాలపురం నియోజకవర్గ పరిధిలో పోలవరం కుడి ప్రధాన కాల్వకి భూములిచ్చిన 40 వేల మంది రైతులు యుద్ధ ప్రతిపాదికన పత్రాలను ఎస్‌డీసీకి సమర్పించాం. అయితే ఎన్నికల కోడ్ సాకుతో ఆ మాట గాలికి వదిలేశారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని జగన్‌రెడ్డి మరోసారి ఈ ఓటు అడిగేందుకు సిద్ధం అనడం విడ్డూరంగా ఉంది.

-దూలం ముత్తయ్యనాయుడు, భూబాధిత రైతు, రాజంపాలెం.



'ఐ లవ్ నిడదవోలు' చిచ్చు

- కష్టం ఒకరిది.. పేరు మరొకరికి
- అధికార పక్షంలో పెరిగిన అసంతృప్తులు
- విరక్తితో జనసేనలో చేరిన ఓ వర్గం నాయకులు

నిడదవోలు, ఏప్రిల్ 21: ఒక పక్క సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వాడి వేడిగా వాతావరణం ఉంటే మరోపక్క ఆ పార్టీలో ఫ్యాను కింద ఉక్కపోత మొదలయ్యింది. ఒక నిర్మాణం ఆ పార్టీలో ఇద్దరు పెద్ద నాయకుల మధ్య అసంతృప్తులను పెంచింది. ఆ నిర్మాణానికి ఒక నాయకుడు రాత్రింబవళ్లు కష్టపడగా పేరు మాత్రం మరో నాయకుడు పట్టుకుపోయాడు. దీంతో కష్టపడిన నాయకుడి బంధువర్గం కాస్తా ఆ పార్టీపై విరక్తి కలిగి జనసేన బాట పట్టారు.

వివరాల్లోకి వెళితే.. నిడదవోలులోని గణపతి సెంటరులో మున్సిపల్ స్థలం ఎన్నో ఏళ్లుగా ఇళ్ళు దుకాణాలతో ఆక్రమణలకు గురై ఉంది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి వెళ్లాయి. ఎందరో మహానాయకులు సైతం ఆక్రమణలు తొలగించేందుకు అడుగు కూడా ముందుకు వేయలేదు. అయితే పట్టణానికి చెందిన ఓ నాయకుడు ధైర్యంగా ముందడుగు వేసి ఎటువంటి వివాదాలు తలెత్తకుండా దగ్గరుండి ఆక్రమణలను సైతం తొలగించి రుడా నిధులు రప్పించి పట్టణ సుందరీకరణలో భాగంగా ఆ ప్రాంతాన్ని అందరితో ఔరా అనిపించేలా రూపొందించారు. నిన్న కాక మొన్న వచ్చిన ఆ నేతకు పేరు రావడం నియోజకవర్గ నాయకుడికి నచ్చకపోవడంతో కష్టపడిన నాయకుడిని పక్కన పెట్టి అంతా తానే చేసినట్టు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నాడు. ఈ సుందరీకరణ ఆ ఇద్దరు ముఖ్య నేతల మధ్య గ్యాప్ పెంచేసిందని పట్టణంలో ఎక్కడ చూసినా ఒకటే చర్చ. పట్టణ నాయకుడు ఎంతో సౌమ్యుడు, మంచివాడు, నిజాయితీపరుడు అనే పేరుండడంతో పట్టణంలో అన్నివర్గాల ప్రజలు పట్టణ నాయకుడికే వత్తాసు పలుకుతున్నారు. నియోజకవర్గ నాయకుడి వ్యవహార శైలిపై ఇటు పట్టణంలోను అటు పార్టీలోను అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా పట్టణ నాయకుడి సొంత బంధు గణం మొత్తం ఆ పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవలే జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. పట్టణ నాయకుడి బంధువర్గం జనసేన బాట పట్టడం జనసేనలో జోష్ పెంచింది. ప్రస్తుతం పట్టణంలో ఇదే హాట్ టాపిక్.

హస్తంతోనే వ్యవస్థ సుభిక్షం

వాకర్స్‌తో కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గిడుగు, ఎమ్మెల్యే అభ్యర్థి బోడా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: హస్తంతోనే వ్యవస్థ సుభిక్షంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరంలో ఉదయం పార్కుల్లో వాకింగ్ చేసే వాకర్స్‌ను గిడుగు రుద్రరాజు, సిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీల కరపత్రాలు అందించారు. అక్కడ వాకర్స్‌తో న్యాయ్‌పత్రపై చర్చించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశం గాని, రాష్ట్రం గాని అభివృద్ధి చెందిందంటే కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనేనన్నారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం వంటి పనులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమౌతాయన్నారు. ప్రజలందరు ఎంపీగా తనను, సిటీ ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌ను గెలిపించాలని కోరారు. అదేవిధంగా జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నగరంలో చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొండలరావు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కూనపురెడ్డి శ్రీనివాస్, చింతాడ వెంకటేశ్వరావు, బిల్డర్ బాబీ, శివాజీ, శర్మ పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న గిడుగు, బోడా

కందుల దుర్గేష్‌కు గన్ని కృష్ణ పరామర్శ



దుర్గేష్‌ను పరామర్శిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21: మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరామర్శించారు. ఆదివారం నిడదవోలు వెళ్లి అక్కడ జనసేన పార్టీ కార్యాలయంలో దుర్గేష్‌ను పరామర్శించారు. దుర్గేష్ భార్య మరణించి కొద్ది రోజులు కాకుండానే ఆయన మాతృమూర్తి మరణించడంతో దుర్గేష్ పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. పార్టీ ఆయనపై పెట్టిన బాధ్యతను నిర్వహిస్తూ నిడదవోలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో గన్ని కృష్ణ పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నాయకుడు ఉప్పులూరి జానకిరామయ్య తదితరులున్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు బి-ఫారాలు



కొవ్వూరు, ఏప్రిల్ 21: టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు మంగళగిరిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బి-ఫారం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు చంద్రబాబు బి-ఫారంలను అందించారు. భారీ మెజార్టీతో విజయం సాధించాలని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ అధినేత తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి కొవ్వూరును గిఫ్టుగా అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారికి పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పార్టీ బి.ఫారం అందజేశారు.

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి?

- ఐక్యంగా ముందుకెళుతున్న కూటమి
- అభ్యర్థి అతనే..మారనున్న కండువా
- నేడు స్పష్టమైన ప్రకటన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)/అనపర్తి, ఏప్రిల్ 21: కూటమి సమన్వయంతో వెళుతుందనడానికి అనపర్తి టికెట్ ఉదాహరణ. ఎక్కడికక్కడ..ఒకరికొకరు సర్దుకుపోతూ ఐక్యత చాటు తున్నారు.అనపర్తి సీటు విషయంలో టీడీపీ-బీజేపీ ఒక ఒప్పందానికి వచ్చినట్టు సమాచారం.ఈ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేయనున్నారు. తొలి జాబితాలోనే టీడీపీ అభ్యర్థిగా ఆయన పేరును చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ పొత్తుల వల్ల బీజేపీకి అనపర్తి సీటు వెళ్లిపోయింది. దీంతో అనపర్తి బీజేపీ అభ్యర్థిగా కృష్ణంరాజును ప్రకటించారు. కానీ ఇక్కడ బలమైన నేతగా ఉన్న రామకృష్ణారెడ్డి వర్గం తీవ్ర అసంతృప్తికి గురికావడంతో పాటు, ఇక్కడ బలహీనంగా ఉంటే లోక్‌సభ సీటుపై కూడా ప్రభా వం చూపుతుందని కూటమి భావించింది. ఈ సీటు మార్పునకు ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు టీడీపీ అభ్యర్థిగా ప్రకటితమైన, సీనియర్ టీడీపీ నేత రామకృష్ణారెడ్డికి బీజేపీ కండువా కప్పి కూటమి అభ్యర్థిగా బరిలోకి దించడానికి నిర్ణయం తీసుకున్నారు. మా కుటుంబం 40 ఏళ్ల నుంచి టీడీపీ గుర్తుతోనే రాజకీయాలు చేస్తోందని రామకృష్ణారెడ్డి మొదట వ్యతిరేకించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యం చేసుకుని శనివారం రాత్రి స్వయంగా రామకృష్ణారెడ్డికి ఫోన్ చేసి కూటమిలో అందరూ ఒకటే. పైగా నీవు కావాలని పార్టీ మారలేదు. కూటమి నేతలంతా చెబుతున్నారు కదా! ధైర్యంగా ముందుకెళ్లండని చెప్పడంతో రామకృ ష్ణారెడ్డి ఒకే చెప్పేశారు. కేడర్‌ను పిలిచి మరీ చెప్పేశారు. ఇదే సమయంలో బీజేపీ అధిష్టానం కూడా అక్కడ బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజుకు సమాచారం తెలియజేసింది. దీంతో అనపర్తి బీజేపీకే ఉంది. టీడీపీ నేతే ఇక్కడ అభ్యర్థి అయ్యారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తన ప్రచార రథాలపై రామకృష్ణారెడ్డి ఫొటోను ఇప్పటికే పెట్టేయడం గమనార్హం. ఇక కొన్ని లాంఛనాలు జరగవలసి ఉంది. రామకృష్ణారెడ్డి పేరును జిల్లా కమిటీ ప్రతిపాదించి, రాష్ట్ర కమిటీకి పంపడం, అక్కడ నుంచి కేంద్ర కమిటీకి వెళ్లడంతో రేపోమాపో అధికారికంగా ప్రకటన వస్తుంది. 23వ తేదీన రామకృష్ణారెడ్డి నామి నేషన్ వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం : నల్లమిల్లి



అనపర్తి, ఏప్రిల్ 21: చంద్రబాబు నిర్ణయం మేరకు తాను పనిచేస్తానని హామీ ఇచ్చానని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామవరంలోని నల్లమిల్లి నివాసానికి ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు చేరుకుని ఆయనతో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కొద్దిసేపు చర్చించారు. నల్లమిల్లి కుటుంబంతో తనకున్న సాన్నిహిత్యంతో రామకృష్ణారెడ్డిని కలిసేందుకు వచ్చానన్నారు. కూటమి అభ్యర్థిగా అనపర్తిలో నల్లమిల్లి పోటీ చేస్తారని బీజేపీ తరఫున నల్లమిల్లి విజయానికి ప్రచారం చేస్తామన్నారు. సీటు విషయంపై సోమవారం స్పష్టమైన ప్రకటన వస్తుందన్నారు. నల్లమిల్లి వెంట తనయుడు మనోజ్‌రెడ్డి ఉన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1	లవ్‌గురు
వై.స్ర్కీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	మంజుమ్మల్ బాయ్స్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	భీమా
స్ర్కీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి